ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
విశాఖపట్నం
జిల్లా వార్తలు
ఆదివారం 28 సెప్టెంబరు 2025

ద్వారకా కాంప్లెక్స్ కిటకిట



ద్వారకా బస్ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల రద్దీ

తీరం.. జనసందోహం



కురుసుర సబ్‌మెరైన్ చూసేందుకు బారులుతీరిన పర్యాటకులు

10లో



సంతానలక్ష్మిగా కనకమహాలక్ష్మి దర్శనం

బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారు శనివారం సంతానలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి కలువపూలతో ప్రత్యేకపూజ చేశారు. ఆదివారం అమ్మవారు విజయలక్ష్మిగా దర్శనం ఇవ్వనున్నారు. అమ్మవారికి గులాబీ పూలతో సహస్ర నామార్చన జరుపుతారు.

-ఆంధ్రజ్యోతి/మహారాణిపేట

ఆర్టీసీకి దసరా తాకిడి

- రీజియన్‌లో 60 స్పెషల్ సర్వీస్‌లు నడిపిన అధికారులు
- శ్రీకాకుళం జిల్లాకు 25, విజయనగరం జిల్లాకు 20...

ద్వారకా బస్‌స్టేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి):

దసరా ప్రయాణికుల సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ విశాఖ రీజియన్ అధికారులు శనివారం 60 స్పెషల్ సర్వీసులు నడిపారు. రీజియన్‌లోని ద్వారకా బస్‌స్టేషన్, మద్దిలపాలెం, సింహాచలం, స్టీల్ సిటీ కాంప్లెక్స్‌ల నుంచి ఈ బస్సులను ఆపరేట్ చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన అనేకమంది విద్య, ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు. వారంతా స్వస్థలాల్లో దసరా జరుపుకునేందుకు వివిధ రవాణా సాధనాలను ఆశ్రయించి విశాఖ వరకూ వస్తున్నారు. ఇక్కడ నుంచి తమ ప్రాంతాలకు వెళ్లేందుకు ఎక్కువగా ఆర్టీసీ బస్సులను వినియోగించుకుంటున్నారు. దీంతో రీజియన్‌లోని ఆర్టీసీ బస్సులకు డిమాండ్ పెరిగింది. షెడ్యూల్ సర్వీసుల కెపాసిటీకి మించి ప్రయాణికులు ఉండడంతో ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపారు. శనివారం విశాఖ నుంచి రాజమండ్రి 8, కాకినాడ 7, శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం, సోంపేట, టెక్కలి, పాతపట్నం ప్రాంతాలకు 25, విజయనగరం, బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం, తదితర ప్రాంతాలకు 20 ప్రత్యేక సర్వీసులు ఆపరేట్ చేశారు.

కిటకిటలాడిన ద్వారకా కాంప్లెక్స్

దసరా ప్రయాణికుల రాకపోకలతో శనివారం ద్వారకా బస్‌స్టేషన్

... మిగతా 8వ పేజీలో

కారు జోరు

జీఎస్టీ తగ్గింపు, దసరా ఆఫర్లతో భారీగా పెరిగిన విక్రయాలు

- సాధారణ రోజులతో పోలిస్తే రెండు నుంచి నాలుగు రెట్లు...
- ఒక్కో కారుపై రూ.60 వేల నుంచి రూ.1.8 లక్షల వరకు తగ్గుముఖం
- ఇదే మంచి తరుణంగా భావిస్తున్న కొనుగోలుదారులు
- మళ్లీ ధరలు పెరిగే అవకాశం ఉందన్న ప్రచారమూ కారణం



శనివారం ఓ కార్ల షోరూంలో కొనుగోలుదారులు

విశాఖపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి):

జీఎస్టీ 2.0 సంస్కరణల కారణంగా కార్ల ధరలు కంపెనీ, మోడల్‌ను బట్టి రూ.60 వేల నుంచి రూ.2.5 లక్షల వరకూ తగ్గాయి. దీంతో గత వారం రోజులుగా కార్ల షోరూమ్‌లన్నీ కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. కొన్ని కంపెనీలైతే డిమాండ్‌కు తగ్గట్టుగా కార్లను సరఫరా చేయలేకపోతున్నాయి. వినియోగదారులు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.

వాహనాలపై గతంలో జీఎస్టీ 28 శాతం ఉండేది. దానిని ఈ నెల 22 నుంచి 18 శాతానికి (చాలా మోడళ్లపై) తగ్గించడం, మరోవైపు దసరా పండగ నేపథ్యంలో కంపెనీలు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించడంతో గడిచిన వారం రోజుల నుంచి ప్రతిరోజూ పదుల సంఖ్యలో బుకింగ్స్ వస్తున్నాయని వరుణ్ మోటార్స్ ఎరీనా డివిజన్ జీఎం జీవీఎస్ఎన్ రాజు తెలిపారు. దసరాకు ముందే డెలివరీ ఇవ్వాలని కోరుతున్నారన్నారు. గతంలో షోరూమ్‌కు రోజుకు ఐదు నుంచి పది మంది వస్తుండే వారని, గడిచిన వారం నుంచి తక్కువలో తక్కువ 50 మంది నుంచి 60 మంది వరకూ వస్తున్నారని, వారిలో కనీసం పది మంది అయినా బుక్ చేసుకుని వెళుతున్నారని వరుణ్ మోటార్స్ ప్రతినిధులు చెబుతున్నారు. ఇదే పరిస్థితి దాదాపు అన్ని కంపెనీల కార్ల షోరూమ్‌లలోనూ కనిపిస్తోంది.

రెండు నుంచి నాలుగు రెట్లు అమ్మకాలు..

దసరా పండగకు మామూలుగానే కార్ల అమ్మకాలు భారీగా ఉంటాయి. పది రోజుల ముందు నుంచి

... మిగతా 8వ పేజీలో

ఇన్నాళ్లకు కోర్కె నెరవేరింది



కారు కొనాలన్న కోర్కె ఎప్పటి నుంచో ఉంది. అయితే, రేట్లు భారీగా ఉండడంతో వెనక్కి తగ్గుతూ వచ్చాను. జీఎస్టీ తగ్గింపుతో ఇప్పుడు రేట్లు దిగివచ్చినట్టు స్నేహితులు చెప్పారు. వెంటనే షోరూమ్‌కు వచ్చి వాకబు చేశాను. మారుతీ స్విఫ్ట్ తీసుకుంటున్నా. గతంలో రూ.7.8 లక్షల వరకూ ఉండేది. ఇప్పుడు సుమారు 1.3 లక్షల వరకు తగ్గింది. ఇదే మంచి తరుణంగా అనిపించి తీసుకున్నా. మూడు, నాలుగు రోజుల్లో డెలివరీ ఇస్తానన్నారు. ఇన్నాళ్లకు కోర్కె నెరవేరుతుండడంతో ఆనందంగా ఉంది.

- ఎన్.త్రినాథ్, ఆరిలోవ

సింహాచలం

22 మందికి అవకాశం?

ట్రస్ట్ బోర్డుపై కసరత్తు

- రాష్ట్రంలో ఇతర జిల్లాల వారికి కూడా అవకాశం కల్పించాలని ప్రభుత్వం యోచన
- ఉత్తరాంధ్రాకే పరిమితం చేయాలని ఇక్కడ నేతల విజ్ఞప్తి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన దేవాలయాలు అన్నింటికీ ట్రస్ట్ బోర్డులను నియమిస్తోంది. అందులో భాగంగా సింహాచలం దేవస్థానానికి కూడా ట్రస్ట్ బోర్డు వేస్తారని ప్రచారం జరుగుతోంది. మొత్తం 22 మందికి అవకాశం కల్పిస్తారని విశ్వసనీయ సమాచారం. దేవస్థానం వార్షిక ఆదాయం రూ.100 కోట్లు దాటితే బోర్డులో రాష్ట్రస్థాయిలో సభ్యులను ఎంపిక చేసే అవకాశం ఉందని అంటున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలాగే సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డులో సభ్యత్వం కోసం పలువురు ఆరాట పడుతున్నట్టు సమాచారం.



సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డులో ఇప్పటివరకూ ఉమ్మడి విశాఖ జిల్లాలోని వారికే అవకాశం కల్పిస్తూ వచ్చారు. శ్రీలక్ష్మీ వరాహనృసింహస్వామి ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు కాబట్టి ఉత్తరాంధ్ర జిల్లాల వరకు సభ్యులను ఎంపిక చేసుకునే వెసులుబాటు ఉంది. అయితే ఇతర జిల్లాల వారు కూడా పేర్లు సూచించినట్టు సమాచారం. దీనిని విశాఖ జిల్లా నాయకులు వ్యతిరేకిస్తున్నట్టు తెలిసింది. శ్రీకాకుళం జిల్లా నుంచి తుని వరకు పార్టీకి సేవ చేసిన వారిని గుర్తించి అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ట్రస్ట్ బోర్డులో అవకాశం కోరుకునే వారు తప్పనిసరిగా కూటమి పార్టీల్లో సభ్యత్వం కలిగిన వారై ఉండాల్సిందేనని అంటున్నారు.

బోర్డు నియామకం వరకే...

సింహాచలం దేవస్థానానికి అనువంశిక ధర్మకర్త ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌గా కొనసాగడం ఆనవాయితీగా వస్తోంది. పూసపాటి అశోక్ గజపతిరాజు ప్రస్తుతం ఛైర్మన్‌గా ఉన్నారు. ఆయన ఇటీవల గోవా గవర్నర్‌గా నియమితులయ్యారు. అది రాజ్యాంగ పదవి. అలాంటి స్థానంలో

... మిగతా 8వ పేజీలో

త్రిసభ్య కమిటీ విచారణ షురూ

- ఏయూలో ఆరోగ్య కేంద్రాలు, అంబులెన్స్ పరిశీలన
- వైద్యులు, సిబ్బంది తగినంతమంది లేరని, మందుల కొరత ఉందని గుర్తింపు?
- మరోసారి పరిశీలించే అవకాశం

విశాఖపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం హాస్టల్ విద్యార్థి మణికంఠ మృతి నేపథ్యంలో నియామకమైన త్రిసభ్య కమిటీ శనివారం విచారణ ప్రారంభించింది. వర్సిటీలోని ఆరోగ్య కేంద్రంలో తగినంతమంది వైద్యులు, సిబ్బంది, అంబు లెన్స్‌లో ఆక్సిజన్, ఇతర అత్యవసర చికిత్స పరికరాలు లేకపోవడం వల్లనే మణికంఠ మృతిచెందాడని విద్యార్థులు రెండు రోజుల పాటు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలంటూ ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సంధ్యాదేవి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణితో జిల్లా కలెక్టర్ త్రిసభ్య కమిటీని నియమించారు. ప్రధానంగా మూడు అంశాలపై విచారణ జరిపి వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు డాక్టర్ సంధ్యాదేవి, డాక్టర్ పి.జగదీశ్వరరావు, డాక్టర్ రాధాకృష్ణ (కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్. సూపరింటెండెంట్ వాణి అందుబాటులో లేరు) శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ఏయూ హెల్త్ సెంటర్స్‌తో పాటు అంబులెన్స్‌ను పరిశీలించారు. నార్త్ క్యాంపస్ ఆవరణలో ఉన్న డిస్పెన్సరీకి కూడా వెళ్లారు. వైద్యులు, సిబ్బంది తగినంతమంది లేరని, అదేవిధంగా మందులు కొరత ఉందని కమిటీ గుర్తించినట్టు తెలిసింది. అయితే మీడియాతో మాట్లాడేందుకు మాత్రం నిరాకరించారు. తాము గుర్తించిన అంశాలను నివేదికలో పొందుపరిచి కలెక్టర్‌కు అందిస్తామని సభ్యులు స్పష్టం చేశారు. కమిటీ మరోసారి ఏయూకు రానుంది.

ది డెక్‌లో మిట్టల్ ఆఫీస్?

పార్కింగ్ కోసం కేటాయించిన ఫ్లోర్ కేటాయింపు?

- బోర్డులో చర్చించిన తరువాత నిర్ణయం
- ఐకానిక్ బిల్డింగ్‌లో స్థలానికి భారీ డిమాండ్
- ఇటీవల వేలంలో రూ.82 పలికిన చదరపు అడుగు ధర

(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)



సిరిపురంలోని 'ది డెక్'

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) సిరిపురం జంక్షన్‌లో నిర్మించిన 'ది డెక్' ఐకానిక్ భవనంలో ఆఫీసు స్థలం కోసం పెద్ద పెద్ద సంస్థలు పోటీ పడుతున్నాయి. వాస్తవానికి దీనిని పార్కింగ్ కోసం నిర్మించారు. మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం డిజైన్ చేశారు. అందులోనే ఆఫీస్ స్పేస్‌కు అవకాశం కల్పించారు. మొత్తం 12 అంతస్తుల్లో మూడు బేస్‌మెంట్లు, రెండో అంతస్తును పార్కింగ్ కోసం కేటాయించారు. మిగిలిన వాటిని ఆఫీస్‌ల కోసం డిజైన్ చేశారు. అందులో రెండు అంతస్తులను జార్జియా యూనివర్సిటీ, బెల్ ఐటీ కంపెనీ తీసుకున్నాయి. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ కోసం ఒక ఫ్లోర్ కేటాయించారు. దక్షిణ కోస్తా రైల్వే జోనల్ కార్యాలయం కోసం రెండు అంతస్తులు తీసుకుంది. గ్రౌండ్ ఫ్లోర్ ఖాళీగా ఉండగా దాని కోసం మూడు సంస్థలు పోటీ పడ్డాయి. ఈ నెల 19న వేలం వేశారు. చదరపు అడుగుకు రూ.82 అద్దె ఇవ్వడానికి ఓ సంస్థ ముందుకువచ్చింది. సుమారు 29 వేల చ.అ. స్థలం తీసుకుంది. దీంతో పార్కింగ్ మినహా అన్ని అంతస్తులు నిండిపోయాయి. అయితే నక్కపల్లిలో స్టీల్ ప్లాంటు పెడుతున్న ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ కంపెనీ తమ ఆఫీసు కోసం 'ది డెక్'లో స్థలం కావాలని పట్టుబడుతోంది. తక్షణమే తమకు కేటాయించకపోతే స్టీల్ ప్లాంటు పనులు ఆలస్యమవుతాయని చెబుతోంది. రెండో అంతస్తులో పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాన్ని తమకు ఇవ్వాలని కోరుతోంది. అవసరమైన మార్పులు చేసుకొని కార్యాలయం ఏర్పాటు చేసుకుంటామని చెబుతోంది. దీంతో వీఎంఆర్‌డీఏ అధికారులు అమరావతి అధికారులతో మాట్లాడి బోర్డులో దీనిపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారు. వాస్తవానికి సిరిపురం జంక్షన్‌లో పార్కింగ్‌కు పెద్ద డిమాండ్ లేదు. చిల్డ్రన్ ఎరీనాలో అవసరమైనంత పార్కింగ్ స్థలం ఉంది. వీఎంఆర్‌డీఏకు వచ్చే వారికి పార్కింగ్ స్థలం ఉంది. సమీపంలో ఎక్కువ మంది

... మిగతా 8వ పేజీలో

డీఎస్సీ తుది జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

- వచ్చే నెల 25వ తేదీ వరకూ అవకాశం
- పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ

విశాఖపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి):

మెగా డీఎస్సీ తుది జాబితాపై అభ్యంతరాలు ఏమైనా ఉంటే వచ్చే నెల 25వ తేదీలోగా తెలియజేయాలని పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకులు బి.విజయభాస్కర్ కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ తుది జాబితాను ఈనెల 15వ తేదీన అధికారిక వెబ్‌సైట్‌లలో ఉంచామని, అభ్యంతరాలను జోనల్ స్థాయిలో ఆర్జేడీ, అదే జోన్‌లో ఇద్దరు డీఈవోలతో కూడిన కమిటీ 15 రోజుల్లో పరిష్కరిస్తుందన్నారు. ఒకవేళ సంతృప్తి చెందకపోతే రాష్ట్ర కమిటీకి ఫిర్యాదు చేయవచ్చునన్నారు.రాష్ట్రస్థాయి కమిటీ ఇచ్చే నిర్ణయంపై సంతృప్తి చెందకపోతే అప్పిలేట్ అథారిటీకి వెళ్లవచ్చునన్నారు. అభ్యర్థులు తమ అభ్యంతరాలను కమిటీకి పంపి, అదే కాపీని ఈ-మెయిల్ చేయాలన్నారు. జోన్-1లో అభ్యర్థులు mdscgrievances.z1@apschooledu.inకుమెయిల్ చేయాలన్నారు.


మధురవాడ కూడలిలో దుకాణాల వద్ద జీవీఎంసీ సిబ్బంది

దుకాణాల తొలగింపు అడ్డగింత

మధురవాడ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ కూడలిలో జీవీఎంసీ సిబ్బంది శనివారం చేపట్టిన దుకాణాల తొలగింపు ఉద్రిక్తతకు దారి తీసింది. మధురవాడ కూడలి నుంచి నగరంపాలెం వెళ్లే రోడ్డు వద్ద నాగోతి సింగన్నకు ఐదు సెంట్ల స్థలం ఉండేది. కొన్నేళ్ల కిందట నగరంపాలెం రహదారిని వంద అడుగులు రోడ్డుగా విస్తరించడంతో ఇల్లు తొలగించారు. మిగతా స్థలంలో సింగన్న వారసులు దుకాణాలు నిర్మించారు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఏసీపీ శాస్త్రి, సిబ్బంది కలిసి దుకాణాలను తొలగించడానికి జేసీబీ తీసుకురావడంతో వారు అడ్డుకున్నారు. ఐదు సెంట్లు స్థలంలో మూడు సెంట్లుకు మాత్రమే టీడీఆర్, నష్టపరిహారం ఇచ్చారని, మిగతా రెండు సెంట్లుకు ఇవ్వలేదని బాధితులు తెలిపారు. మిగతా స్థలానికి టీడీఆర్, నష్టపరిహారం ఇస్తేనే దుకాణాల తొలగింపునకు అంగీకరిస్తామని చెప్పారు. ఉన్నతాధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని చెప్పి జీవీఎంసీ అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోవడంతో వివాదం సద్దుమణిగింది.

శమీ పూజకు అప్పన్న పూదోట ముస్తాబు


ముస్తాబవుతున్న పూదోట

సింహాచలం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో వచ్చేనెల రెండో తేదీన నిర్వహించనున్న శమీ పూజోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. చెడుపై మంచి విజయానికి గుర్తుగా ఏటా విజయదశమి రోజున ఈ ఉత్సవం నిర్వహించడం సంప్రదాయం. దీంతో పూదోటను శుభ్రపరచి గోడలకు, మండపానికి రంగులద్దుతున్నారు. శమీ వృక్షం వద్ద పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, మెట్ల మార్గం రాళ్ల, నీటితడి, లేకుండా శుభ్రపరుస్తున్నారు. పల్లకిలో స్వామివారిని మెట్లమార్గంలో తీసుకువచ్చి పూదోటలో శమీ పూజోత్సవం తరువాత రాజాలంకారంలో అశ్వ వాహనంపై మాడవీధుల్లో తిరువీధి ఉత్సవాన్ని నిర్వహిస్తారు.

ఈస్ట్‌పాయింట్ కాలనీలో బొమ్మల కొలువు


ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

సింహాచలం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : దసరా, సంక్రాంతి పండగల సమయాల్లో తెలుగింట సంప్రదాయబద్ధంగా ఏర్పాటు చేసే బొమ్మల కొలువుకు ప్రత్యేకత ఉంది. ప్రస్తుత కంప్యూటర్ యుగంలోనూ భవిష్యత్తు తరాలకు తెలియజేసే ప్రయత్నం చేస్తున్నారు 98వ వార్డు శ్రీనివాసనగర్ ఈస్ట్‌పాయింట్ కాలనీకి చెందిన న్యాయవాది మూలా భారతి. రెండు దశాబ్దాలుగా తమ ఇంట బొమ్మల కొలువును ఏర్పాటు చేస్తూ ప్రశంసలందుకుంటున్నారు. దేవతామూర్తులు, పల్లె వాతావరణం, క్రికెట్ స్టేడియం, వివాహ వేడుక, జీవజాతులను ప్రతిబింబించేలా ఏర్పాటు చేయడంతో పాటు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. బొమ్మల కొలువును తిలకించేందుకు వివిధ ప్రాంతాల మహిళలతో పాటు యువత తరలివస్తున్నారు.

'విజ్ఞాన్ విహార'లో సైన్స్ ఎగ్జిబిషన్


సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న అతిథులు

ఆనందపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుడిలోవ విజ్ఞాన్ విహార ఆశ్రమ పాఠశాలలో శనివారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. విద్యార్థులు పలు అంశాలపై ప్రాజెక్టులు తయారు చేసి, ప్రదర్శన లో ఉంచారు. ఈ సందర్భంగా ఎన్ఐటీ ప్రొఫెసర్ జి. రామశాస్త్రి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా చదువుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రదర్శనలో విద్యార్థులు ఆకాశ్ స్కేల్, ఆపరేషన్ సిందూర్‌లో ప్రయోగించిన శత్రువుల పన్నాగం పసిగట్టే పరికరం, జల విద్యుత్, వాయు విద్యుత్, సౌర విద్యుత్ వంటి నమూనాలతో పాటు బయో రియాక్టర్, ఆధునిక నీటి పారుదల వ్యవస్థ, ఆహారం నిల్వ, ట్రైన్ ట్రావెల్, బొగ్గు నుంచి విద్యుత్ తయారీ, పాల నుంచి ప్లాస్టిక్ తయారీ తదితర నమూనాలను అద్భుతంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో బీవీకే కళాశాల ప్రిన్సిపాల్ రత్నశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార ప్రదర్శన


కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ అధికారులు

పద్మనాభం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. టీబీ, షుగర్, బీపీ తదితర పరీక్షలు చేసి, మందులు అందజేశారు. అలాగే పోషణ మాసంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు టి.పాప, చిన్నారావు, ఎంపీటీసీ సభ్యురాలు కె. లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి, పీహెచ్‌సీ ఎంహెచ్ఈఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సత్యవతి, నాయకులు పద్దు, ఎర్నాయుడు, తదితరులు పాల్గొన్నారు.


ఎండాడలో దుర్గాదేవి


గీతంలో రాజరాజేశ్వరి అమ్మవారు


విజినిగిరిపాలెంలో అమ్మవారు


బేడామండపంలో తిరువీధి ఉత్సవం

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

లలితా త్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ దర్శనం

ఎండాడ/మధురవాడ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని ఎండాడలో ఉన్న దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు లలితా మహాత్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు శనివారం దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి చామంతి, లిల్లీ పూలతో పుష్పార్చన చేశారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) ఆవరణలో ఉన్న రాజరాజేశ్వరీదేవి ఆలయంలో కూడా అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మధురవాడలోని మానం ఆంజనేయనగర్‌లో ఉన్న ఆలయంలో కూడా అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా సామూహిక కుంకుమ పూజలు జరిపారు.

భీమునిపట్నంలో..

భీమునిపట్నం : పట్టణంలోని గొల్లవీధి శ్రీకృష్ణ జంక్షన్‌లో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు ఘటాలు తీసుకువచ్చి దుర్గాదేవి ప్రతిమను ఊరేగించారు. శ్రీకృష్ణ జంక్షన్ నుంచి ప్రారంభమైన ఊరేగింపు కన్యకాపరమేశ్వరి ఆలయం మీదుగా నరసింహస్వామి గుడి వీధి నుంచి తిరిగి అమ్మవారి మండపం వరకూ జరిగింది.

వైభవంగా అమ్మవార్ల తిరువీధి

సింహాచలం : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో శనివారం సాయంత్రం అమ్మవార్ల బేడా మండప తిరువీధి వైభవంగా నిర్వహించారు. పవళింపు సేవ తరువాత సువర్ణ, చతుర్భుజి తాయార్ల ఉత్సవమూర్తులను పుష్పమాలికలతో అలంకరించి పల్లకిలో ఉంచారు. ఆలయ ఆస్థాన విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేదమంత్రోచ్చారణలు నడమ తిరువీధి వైభవంగా జరిపారు. కాగా విజినిగిరి పాలెంలోని ఉమాచంద్రమౌళేశ్వరస్వామి సన్నిధిలో ఉమాదేవి లలితా త్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర ప్రాంతాలకు చెందిన వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని, కుంకుమ పూజలు చేశారు.


గొల్లవీధిలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి ప్రతిమ

వాటర్ ట్యాంక్ చుట్టూ తుప్పలు

- కొన్ని నెలలుగా కానరాని పరిశుభ్రత
- విచ్చలవిడిగా పాముల సంచారం
- భయాందోళన మధ్య జీవీఎంసీ సిబ్బంది

ఎండాడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని బీసీ కాలనీలో ఉన్న రక్షిత మంచినీటి పథకం చుట్టూ తుప్పలు, డొంకలు పేరుకుపోయాయి. పాముల సంచారం ఎక్కువగా ఉండడంతో మంచినీరు సరఫరా చేయడానికి వెళ్లే సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. ట్యాంకు గేటుకు తాళం వేయకపోవడంతో ఆకతాయిలకు అడ్డాగా మారింది. చీకటిపడిన తరువాత గంజాయి, మద్యం సేవించే వారితో పాటు పేకాటరాయుళ్లు ఇక్కడికి చేరి, పరిసరాలను పాడుచేస్తున్నారు. అలాగే ఈ ట్యాంక్ నుంచి ఎయిమ్స్ కళాశాల ప్రహరీ గోడను ఆనుకుని కొండపై ఉన్న మరో ట్యాంక్ పరిస్థితి కూడా అంతే. అక్కడ కూడా తుప్పలు, ముళ్ల కంపలు ఉండడంతో జీవీఎంసీ సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతంలో బహిరంగ ప్రదేశాలు ఎక్కువగా ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి ఆయా ట్యాంకుల పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


బీసీ కాలనీలో వాటర్ ట్యాంక్ చుట్టూ పేరుకుపోయిన తుప్పలు

వ్యాధుల నివారణకు చర్యలు

- మండల సమావేశంలో ఎంపీపీ రాంబాబు

పద్మనాభం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కె. రాంబాబు చెప్పారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండి దోమల వ్యాప్తి కారణంగా వైరల్ జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. అలాగే తాగునీటి కలుషితం వల్ల డయేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. వీటి నివారణకు వైద్యారోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవడంతో పాటు వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. మండలంలోని ప్రధాన రోడ్లన్నీ శిథిలావస్థకు చేరుకొని గోతులమయంగా తయారయ్యాయని, వీటికి మరమ్మతు చేపట్టి ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలని ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖాధికారులకు సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచడంతో పాటు ఆధునిక సేద్య పరికరాలను సమకూర్చాలన్నారు. అనంతరం పలు శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ ఛైర్మన్ ఎస్. గిరిబాబు, భీమిలి మార్కెట్ కమిటీ ఛైర్మన్ రామస్వామినాయుడు, వైస్ ఎంపీపీ ఈర్లె రాజేశ్వరి, ఎంపీడీఓ నగేశ్, ఏఓ జయ ఉమ, పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

నేటి నుంచి శిల్పారామంలో దసరా ఉత్సవాలు

మధురవాడ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ శిల్పారామంలో ఆదివారం నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్టు పరిపాలనాధికారి తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆదివారం మీనాక్షి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ కళాకారుల కూచిపూడి ప్రదర్శన, సోమవారం సరస్వతీ నృత్యాలయం కళాకారుల జానపద నృత్య ప్రదర్శన ఉంటాయని చెప్పారు. మంగళ, బుధ, గురువారం కూడా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఎన్ఎంఎంఎస్ విద్యార్థులకు శిక్షణ

తగరపువలస, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్) శిక్షణ ఇచ్చారు. ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణలో మూలకుద్దు ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం దుంప దాలయ్యబాబు విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 30 వరకు గడువు ఉందని, డిసెంబరు 7న పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, సలహాదారు జీవీ అప్పారావు, వ్యవస్థాపక అధ్యక్షుడు గంటాన మోహనరావు, బయాలజీ అధ్యాపకుడు వైవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

ఎండాడ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎండాడలో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 200 మందికి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మీసాల రొయ్య


మత్స్యకారులకు చిక్కిన రొయ్యలు

సాగర్‌నగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ తీరంలో వేట సాగించిన మత్స్యకారులకు శనివారం మీసాల రొయ్యలు (ఇవో రకం) దొరికాయి. వీటికి మీసాలు పొడవుగా ఉంటాయి. వీటి ధర మార్కెట్‌లో కిలో రూ. 1800 నుంచి రూ. 2 వేలు వరకు ఉంటుంది. ఈ రొయ్యలను ఎక్కువగా ఫైవ్ స్టార్, సెవెన్ స్టార్ హోటళ్లలో వంటకాలకు వినియోగిస్తుంటారు. విదేశాలకు కూడా ఎగుమతి చేస్తుండడంతో వీటికి డిమాండ్ ఎక్కువ. మత్స్యకారులు రుషికొండ కూడలికి వీటిని తీసుకురావడంతో పలువురు కొనుగోలు చేశారు.

తగరపువలస డిగ్రీ కళాశాలలో రెండో విడత అడ్మిషన్లు

తగరపువలస, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈనెల 26 నుంచి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి తెలిపారు. గతంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు డైరెక్టుగా వెబ్ ఆప్షన్స్‌లో తగరపువలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకోని వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు వస్తే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయిస్తామన్నారు. బీఏ హిస్టరీ, బీఎస్సీ మ్యాథ్స్, కెమిస్ట్రీ, జూవాలజీ, బోటనీ, కంప్యూటర్ సైన్స్, బీకాం కంప్యూటర్స్ అప్లికేషన్స్ గ్రూపుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఈనెల 29 వరకూ అవకాశం ఉందని, ఆసక్తి గల వారు 8639548433, 8522975829, 8978883125 సెల్ నంబర్లను సంప్రతించాలని ఆమె సూచించారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయదేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై ఉంచారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

పద్మనాభం ఎంపీడీఓగా రూపేశ్

పద్మనాభం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభం ఎంపీడీఓగా కె. రూపేశ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన విజయనగరం జిల్లాలోని ఎల్. కోట, పార్వతీపురం మం డలాల్లో పనిచేశారు. కొన్ని రోజులు వ్యక్తిగత సెలవు అనంతరం ఇక్కడికి నియమించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన విజయకుమార్ డీఎల్‌డీఓగా పదోన్నతిపై వెళ్లారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి విజయవాడ సత్యనారాయణపురానికి చెందిన బి. వెంకట సుబ్బారావు, ధనలక్ష్మీ దంపతులు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం నగదు రూపంలో దేవాలయ ప్రజా సంబంధాల విభాగం అధికారులు సునీల్, అప్పలనాయుడుకు శనివారం వారు అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించి శేషవస్త్రంతో సత్కరించారు.


వ్యర్థాలు, మురుగు నీటితో నిండిపోయిన చెరువు

అధ్వానంగా చిల్లపేట చెరువు

తగరపువలస, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక చిల్లపేట చెరువు వ్యర్థాలు, మురుగు నీటితో నిండిపోతోంది. చెరువును ఆధునికీకరిస్తామని నాయకులు పదేళ్లుగా చెబుతున్నా.. ఆచరణలో చూపడం లేదు.11 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువును హైదరాబాద్ ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేస్తామని వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ అధికారులు ప్రకటించారు. చుట్టూ పార్కులు. బోటు షికారు, గట్టుపై పర్యాటక స్టాల్స్ వంటివి ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు చేశారు. కానీ ఇప్పటివరకు చెరువు గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు.ఈ చెరువులో పలు ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీరు కలుస్తోంది. దీంతో నీరు నాచు పట్టి, విపరీతమైన దుర్వాసన వ్యాపిస్తోంది.స్థానికుల విన్నపాల మేరకు అధికారులు అప్పుడప్పుడు పూడికలు తీసి వదిలేస్తు న్నారు తప్ప శాశ్వత పనులు చేపట్టడం లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి చెరువు అభివృద్ధిపై చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

మధురవాడలో పందుల బెడద


వుడాకాలనీలో సంచరిస్తున్న పందులు

మధురవాడ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు లో పందుల సంచారం విపరీతంగా పెరిగింది. మిథిలాపురి వుడాకాలనీ, స్వతంత్రనగర్, పోర్టు కాలనీ, శ్రీనివాసనగర్, చంద్రంపాలెం, పాత మధురవాడ మెట్ట, బింద్రానగర్, షిప్‌యార్డు కాలనీల్లో ఈ పరి స్థితి ఎక్కువగా ఉంది. కాలనీల్లో పదుల సంఖ్యలో పందులు గుంపు గుంపులుగా తిరుగుతున్నాయి. వీటివల్ల పారిశుధ్యం లోపించడంతో పాటు దోమల వ్యాప్తి అధికమవుతోంది. గతంలో పందుల నియంత్రణకు జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకునేవారు. ప్రస్తుతం ఎవరూ పట్టించుకోవడం లేదు. పెంపకందారులు వాటిని నివాసాల మధ్య విడి చిపెడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మహిళా రచయితల సాహిత్య కృషిపై 8, 9 తేదీల్లో జాతీయ సదస్సు

విశాఖపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ కళాశాల భాషా విభాగాల ఆధ్వర్యంలో స్వాతంత్ర్యానంతర తెలుగు-హిందీ సాహిత్యంలో 'మహిళా రచయితల సాహిత్య కృషి' అనే అంశంపై అక్టోబరు 8, 9 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. కళాశాలలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. రెండు రోజులు జరిగే ఈ సదస్సుకు దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల ఆచార్యులు విచ్చేసి హిందీ, తెలుగు భాషల్లో మహిళా రచయితల సాహిత్య కృషిపై ప్రసంగిస్తారని కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.కె.జయలక్ష్మి పేర్కొన్నారు. ఈ బ్రోచర్ ఆవిష్కరణలో డాక్టర్ నిర్మల, డాక్టర్ ఎస్.దీప్తి, డాక్టర్ కోటేశ్వరరావు, వెంకటరత్నం పాల్గొన్నారు.

కారు జోరు

... 7వ పేజీ తరువాయి

పెద్దఎత్తున బుకింగ్స్ వస్తుంటాయి. మారుతీ సుజుకీ కంపెనీ వివిధ మోడల్ కార్లు సాధారణ రోజుల్లో జిల్లాలోని అన్ని షోరూమ్‌లలో కలిపి పది నుంచి 12 వరకూ విక్రయిస్తుంటుంది. దసరాకు ముందు అయితే ఈ సంఖ్య మరో ఎనిమిది వరకూ పెరుగుతుంది. అంటే, 20 కార్లను విక్రయిస్తుంటారు. కానీ, ఈ నెల 22 నుంచి అనూహ్యంగా విక్రయాలు పెరిగినట్టు వరుణ్ మోటార్స్ ప్రతినిధులు చెబుతున్నారు. ప్రతిరోజూ కనీసం 60 నుంచి 70 వరకూ జిల్లాలో విక్రయిస్తున్నారు. ఇందులో అత్యధికం స్విఫ్ట్, డిజైర్, వేగనార్, బ్రెజా ఉన్నాయి. హ్యుండయ్ కంపెనీకి చెందిన కార్ల విక్రయాలు కూడా అలాగే ఉన్నాయి. క్రెటా కారు అత్యధికంగా సేల్ అవుతున్నట్టు ఆ సంస్థకు చెందిన ప్రతినిధులు వెల్లడించారు. సాధారణ రోజుల్లో నాలుగు షోరూమ్‌లల్లో పది కార్లను విక్రయిస్తే..జీఎస్టీ తగ్గిన తరువాత నుంచి 25 నుంచి 30 వరకు విక్రయిస్తున్నట్టు చెబుతున్నారు. టాటా, మహీంద్ర వంటి కంపెనీలకు చెందిన కార్ల విక్రయాలు కూడా రెట్టింపు అయినట్టు చెబుతున్నారు.

పెరిగిపోతాయన్న ప్రచారమూ..

జీఎస్టీ మార్పుతో కార్ల ధరలు ఊహించని రీతిలో తగ్గాయి. అదే సమయంలో దసరా పండగ నేపథ్యంలో కార్ల కంపెనీలు ఆఫర్లను అందిస్తున్నాయి. కారు మోడల్‌ను బట్టి లక్ష రూపాయలు నుంచి రూ.2.5 లక్షల వరకు తగ్గుతోంది. కొద్దిరోజుల తరువాత తగ్గిన జీఎస్టీ రేట్లకు అనుగుణంగా కంపెనీలు ధరలు పెంచేస్తాయన్న ప్రచారమూ డిమాండ్ పెరగడానికి కారణంగా చెబుతున్నారు.

సింహాచలం ట్రస్ట్ బోర్డుపై కసరత్తు

... 7వ పేజీ తరువాయి

ఉన్నవారు ఇతర ఏ కార్యకలాపాల్లోను కీలకంగా ఉండకూడదని నిబంధనలు చెబుతున్నాయి. దీనివల్ల ఆయన అక్కడ గవర్నర్‌గా, ఇక్కడ ఛైర్మన్‌గా కొనసాగడానికి సాంకేతికంగా అవకాశం లేదని అంటున్నారు. ఆయన కూడా ట్రస్ట్ బోర్డు నియామకంపై పెద్దగా ఆసక్తి చూపడం లేదని సమాచారం. గతంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు కొందరు అంతా తామై వ్యవహరించి, ఆలయ పరిపాలనా వ్యవహారాలకు అడ్డం పడిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బోర్డు అవసరం లేదని ఆయన అభిప్రాయపడుతున్నట్టు తెలిసింది. అయితే పార్టీ అధికారంలో ఉన్నందున ఇలాంటి నియామకాలు అవసరం కాబట్టి ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. 22 మందితో బోర్డును ఏర్పాటు చేయడానికి ఫైల్ సిద్ధం చేశారు.

'ది డెక్'లో మిట్టల్ ఆఫీస్?

... 7వ పేజీ తరువాయి

వాహనాల్లో వచ్చే భవనాలు ఏమీ లేవు. దాంతో బేస్‌మెంట్‌లో పార్కింగ్ కోసం కేటాయించిన మూడు అంతస్థులు సరిపోతాయని భావిస్తున్నారు. వాటిలో 300 కార్లు, మరో 200 ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసుకోవచ్చు. అంతకు మించిన డిమాండ్ ఉండదనే భావనతో పార్కింగ్ కోసం ఉద్దేశించిన రెండో అంతస్థును ఆఫీస్‌గా మార్చాలని నిర్ణయించారు.

ఆర్టీసీకి దసరా తాకిడి

... 7వ పేజీ తరువాయి

కిటకిటలాడింది. బస్సులన్నీ కిక్కిరిసిపోయాయి. ఉత్తరాంధ్ర నుంచి దూర ప్రాంతాలకు వెళ్లాలన్నా, దూరప్రాంతాల నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు రావాలన్నా విశాఖ ద్వారకా బస్‌స్టేషన్ ట్రాన్సిట్ పాయింట్‌గా ఉంటుంది. దాంతో కాంప్లెక్స్ ప్రయాణికులతో రద్దీగా మారింది. ఉదయం నుంచి రాత్రి 9.00 గంటల వరకూ ఇదే పరిస్థితి కొనసాగింది. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు అధికారులు ఎప్పటికప్పుడు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశారు.



చెత్తను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

రోడ్డుపై చెత్త తొలగింపు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): హెచ్‌బీకాలనీ నుంచి కృష్ణా కళాశాల రోడ్డులో ఇటీవల జరిపిన ఆపరేషన్ లంగ్స్‌లో భాగంగా పేరుకుపోయిన చెత్తను శనివారం జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. 16వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో టిప్పర్ సాయంతో చెత్తను తొలగించి, శుభ్రంగా తీర్చిదిద్దారు. శుభ్రం మేస్త్రి నమ్మి చిన్నరాజు, జి.బాబు తదితరులు ఉన్నారు.

వాకర్స్‌కు వైద్య పరీక్షలు



వాకర్స్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక అల్వార్‌దాస్ మైదానంలో శుక్రవారం వాకర్స్‌కు ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించారు. మెడికవర్ ఆస్పత్రి వైద్య సిబ్బంది బీపీ, బ్లడ్ షుగర్ పరీక్షలు నిర్వహించారు. వీఎస్సీ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

16వ వార్డులో అన్నదానం

వెంకోజీపాలెం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) :16వ వార్డు సంజయ్‌గాంధీ కాలనీలో బాయ్‌ఫ్రెండ్స్ నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

సిరిపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలో రాణించాలని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, సదరం విద్యా సంస్థల అధినేత సతీష్ పొన్నం అన్నారు. ఆ సంస్థల ఆధ్వర్యంలో శనివారం సిరిపురం వుడా చిల్డ్రన్స్ ఎరీనాలో కల్చరల్ ఫెస్ట్ నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించటడతో పాటు, ఉపాధి అవకాశాలు కల్పించేలా తగిన శ్రద్ధ తీసుకోవటం అభినందనీయమన్నారు. లక్ష్య సాధనలో విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా సాగాలన్నారు. ఈ సందర్భంగా పలువురిని సత్కరించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ సాయి దిలీప్, డాక్టర్ శిరీషా రాణి, డాక్టర్ దీప్తి తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ఓజి** : మెలోడి, శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, శరత్, లీలామహల్, శ్రీరామ, కిన్నెర, కామేశ్వరి, గోకుల్, వెంకటేశ్వర-1,2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1(పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కిందపురి** : శ్రీరామా, నరసింహ (గోపాలపట్నం), (గాజువాక),
- **ఘాటీ** : గోకుల్, ముక్తాస్, (గాజువాక)
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 25, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 28, పచ్చిమిర్చి 40,కాకరకాయలు 40, బీరకాయలు 30, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 40, దొండకాయలు 36, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 70, బరబాటి 34, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 50, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 56, కీరదోస 32, కాప్సికమ్ 52, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 44,దేముడు చిక్కుడు 60, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 80, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	115
లైవ్ ధర	135
విత్ స్కిన్	240
స్కిన్‌లెస్	250

జోరందుకున్న రీ మెజర్‌మెంట్స్ సర్వే

- ఇక పక్కాగా ఇళ్ల కొలతలు
- వాటి ఆధారంగానే పన్ను విధింపు
- జోన్-3లో 87 వేల అసెస్‌మెంట్లు
- వచ్చే నెల పదో తేదీ నాటికి పూర్తిచేసేలా చర్యలు



ఇంటికి కొలతలు తీస్తున్న సచివాలయ సిబ్బంది

మద్దిలపాలెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిర్దిష్ట కొలతల ఆధారంగా ఆస్తి పన్ను వసూలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రీ మెజర్‌మెంట్స్ సర్వేకు శ్రీకారం చుట్టింది.ఈఏడాది ఆగస్టులో ప్రారంభమైన ఈ సర్వే కొనసాగుతోంది. అక్టోబరు 10లోగా పూర్తి చేయాల్సి ఉండడంతో ప్రస్తుతం జోరందుకుంది.సచివాలయం అడ్మిన్లు ఇంటింటికీ వెళ్లి పక్కాగా కొలతలు తీస్తున్నారు. రేకుల షెడ్లు, భవనాలు, కమర్షియల్ భవనాలు, నివాస గృహాలు పరిశీలించి కొలతలు వేస్తున్నారు. సిబ్బంది తీసుకుంటున్న కొలతలు, గతంలో గృహ యజమానులు సమర్పించిన కొలతలు సరిచూస్తున్నారు. కాగా జీవీఎంసీ జోన్-3లో 87 వేల అసెస్‌మెంట్లు ఉన్నాయి. సచివాలయ సిబ్బందికి ఇతర సర్వేలు కూడా ఉండడంతో రీ మెజర్‌మెంట్స్ సర్వే వెనుకబడింది. దీనివల్ల ఇప్పటి వరకు 30 శాతం వరకు కొలతలు తీసుకోగలిగారు. మరో పదిహేను రోజులు మాత్రమే గడువు ఉండడంతో సర్వేను ముమ్మరం చేశారు.

పాత కొలతలకు చెక్..

జోన్-3లో గతంలో యజమానులు సమర్పించిన కొలతల ప్రకారమే ఇంటి పన్ను విధించేవారు. నిర్దిష్ట కొలతలు తీయాల్సిన జీవీఎంసీ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరించేవారు.మాన్యువల్‌లో తప్పుడు లెక్కలు చూపి ఆస్తిపన్ను ఎగ్గొట్టే యజమానుల సంఖ్య బాగా పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో రీమెజర్‌మెంట్స్ తీసి పాత కొలతలకు చెక్ పెడుతున్నారు. దీనివల్ల ఆస్తి పనుల్లో భారీగా మార్పులు కనిపించే అవకాశం ఉంది. ఇకపై ఆస్తులను సర్వే చేసి, పన్నును కచ్చితంగా నిర్ణయించనున్నారు. దీనికి సచివాలయ సిబ్బందికి యాప్ ఇవ్వలేదు. దీంతో నోట్‌బుక్‌లో నమోదు చేసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో ఆయా అసెస్‌మెంట్ కొలతలు చెక్ చేస్తున్నారు. కొలతల్లో తేడాలుంటే సరిచేస్తున్నారు.

పన్ను ఎగవేతకు చెక్..

జోన్-3లో అనధికర నిర్మాణాలు జరిగాయి. జీవీఎంసీ ప్లాన్‌లో లేకపోవడంతో యజమానులు పన్ను చెల్లించడం లేదు. చాలామంది కమర్షియల్ వ్యవహారాలు నిర్వహించే భవనాలకు గృహ కేటగిరీలో పన్ను చెల్లిస్తున్నారు. ఈ సర్వేతో అలాంటి పన్ను ఎగవేతలకు చెక్ పడనుంది. సిబ్బంది భవనం కొలతలు తీసుకుని అవి ఏ కేటగిరీ కిందకు వస్తాయో నమోదు చేసుకుంటున్నారు.అనధికార నిర్మాణాలకు కూడా పక్కాగా కొలతలు వేసి పన్ను విధించేలా చర్యలు ప్రారంభించారు. ఈ ప్రక్రియతో జీవీఎంసీ ఆస్తిపన్ను ఆదాయం భారీగా పెరుగుతుందని భావిస్తున్నారు.

'విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలి'



ధర్నాలో వివిధ సంఘాల ప్రతినిధులు

సిరిపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని కోరుతూ అఖిల పక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ కన్వీనర్ జగ్గునాయుడు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్ ప్రైవేటు స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమిత ప్రేమ చూపిస్తున్నాయని, కానీ ప్రభుత్వ రంగంలోని సుదీర్ఘ చరిత్ర కలిగిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇక్కడి ప్లాంట్‌లో దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్మికులను నిర్లక్ష్యంగా తొలగించడం అన్యాయమని, ఈ చర్యలతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయన్నారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తేనే మనుగడ ఉంటుందన్నారు. ఆ దిశగా ప్రజా ప్రతినిధులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాఖను టూరిజం హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం



బీచ్ రోడ్డులో టూరిజం ర్యాలీ

రామ్‌నగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విశాఖను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని టూరిజం జిల్లా అధికారి మాధవి అన్నారు. ప్రపంచ పర్యటక దినోత్సవం సందర్భంగా శనివారం క్రూజ్ కలనరీ అకాడమీ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో సాగరతీరంలోని కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడుతూ అన్ని పర్యటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామని, పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామన్నారు. పర్యాటక రంగంలో యువతకు ఉపాధి లభించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. నిర్వాహక సంస్థ డైరెక్టర్లు ప్రభాకర్ రోహిత్, సయ్యద్ మాట్లాడుతూ యువత పర్యాటక శాఖలో రాణించేందుకు వీలుగా తగిన శిక్షణ అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.







స్వతంత్రనగర్ పార్కులో అలరిస్తున్న కళాకృతులు



మధురవాడ,సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని స్వతంత్రనగర్ కాలనీలో రూ. 2.5 కోట్లతో ఏర్పాటు చేసిన పార్కులో కళాకృతులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. పార్కుకు వచ్చిన వారికి ఆహ్లాదంతో పాటు వినోదం అందించడానికి వీటిని ఏర్పాటు చేశారు. ఫైబర్‌తో పాటు ఇతర మెటీరియల్ వినియోగించి తయారు చేసిన ఈ కళాకృతుల్లో కొన్ని ఆలోచింపజేసేవిగా ఉన్నాయి. ముఖ్యంగా సాగరకన్య, మల్లయోధులు, యువతీ, యువకుడు, పక్షుల ఆకృతులు వాకర్స్‌ను, సందర్శకులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. కళాకృతుల నిర్వహణను కూడా జీవీఎంసీ తీసుకోవడంతో ఇవి చెక్కుచెదరకుండా ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి.



పార్కులో ఏర్పాటు చేసిన కళాకృతులు

నిరుపయోగంగా బస్టాప్



పెట్రోల్ బంక్ ప్రాంతంలో నిరుపయోగంగా ఉన్న బస్టాప్

ఎండాడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని ఎండాడ పెట్రోల్ బంకు వద్ద నిర్మించిన బస్టాప్ నిరుపయోగంగా ఉంది. బంక్ పరిసరాల్లో వివేకానందనగర్, దసపల్లా లేఅవుట్, శాంతినగర్, తదితరులు కాలనీలు ఉన్నాయి. అలాగే ఈ ప్రాంతంలో అనేక అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు జరిగాయి. స్థానికుల ప్రయాణ అవసరాల నిమిత్తం పెట్రోల్ బంక్ పక్కన అప్పటి ఎంపీ హరిబాబు ఎంపీ నిధులతో బస్ షెల్టర్ నిర్మించారు. మొదట్లో ఇక్కడ బస్సులను ఆపే వారు. ప్రస్తుతం బస్సులు ఆపకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండాడ కూడలిలో బస్సు దిగి ఆటోలను ఆశ్రయిస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం వైపు నుంచి వచ్చే బస్సులు ఆపకపోతే హనుమంతవాక వరకు, అలానే నగరం నుంచి వచ్చే బస్సులు ఆపకపోతే ఎండాడ కూడలిలో దిగాల్సి వస్తోంది. దీనివల్ల ప్రయాణి కులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాగర్‌నగర్ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు వాత్సాయి శ్రీరామ్‌వర్మ ఈవిషయమై ఆర్టీసీ ఆర్ఎంకు గతంలో ఫిర్యాదు చేశారు. అయినా ఆర్టీసీ అధికారులు పట్టించుకోక పోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు.

వ్రిందాలో అరుదైన శస్త్ర చికిత్స

పది గంటలు శ్రమించి రోగిని కాపాడిన వైద్యులు

ఆరిలోవ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సుడో మిక్సోమా పెరిటొనై (అబ్డామినల్ లైనింగ్ క్యాన్సర్) అనే వ్యాధితో బాధపడుతున్న రోగికి ఆరిలోవ హెల్త్‌సిటీలోని వ్రిందా సూపర్ స్పెషాలిటి క్యాన్సర్ రీసెర్చ్ సెంటర్ సర్జికల్ ఆంకాలజిస్టు డాక్టర్ వంశీధర్ పెట్రేవ్ పునర్జన్మ ప్రసాదించారు. దాదాపు పది గంటలపాటు శ్రమించి చేసిన శస్త్ర చికిత్స విజయవంతమైంది. ఈ మేరకు శనివారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా రాజాంనకు చెందిన కాంతారావు (50) పొట్టలో జిగురు లాంటి ద్రవం చేరడంతో ఆస్పత్రికి వచ్చాడు. డాక్టర్ వంశీధర్ పరిశీలించి పరీక్షలు చేయించారు. అపెండిక్స్‌లో ట్యూమర్ ఉన్నదని తెలియడంతో సుడో మిక్సోమా పెరొటొనైగా గుర్తించారు. దానిని నయం చేసేందుకు పది గంటలు శ్రమించి ఉదరంలో హిపెక్ అనే పరికరం ద్వారా కీమోథెరపీ ఇచ్చి చేసిన శస్త్రచికిత్స విజయవంతమయిందన్నారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యంగా ఉన్నట్టు తెలిపారు. సమావేశంలో ఎనస్థీషియన్ డాక్టర్ హరికృష్ణ, వైద్యులు పాల్గొన్నారు.



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న విండ్రా ఆస్పత్రి వైద్యులు



కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జీవీఎంసి కమిషనర్ కేతన్ గార్గ్

త్వరతగతిన కల్వర్టు నిర్మాణం పూర్తిచేయండి

అధికారులకు కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ ఇబ్బందులకు కారణంగా మారిన కల్వర్టు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. 'డ్రైనేజీ పనుల జాప్యంతో ట్రాఫిక్ ఇబ్బందులు' శీర్షికన శనివారం 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన కథనానికి స్పందించిన కమిషనర్ ఇసుకతోటలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఎందుకు నెమ్మదించాయని అధికారులను ప్రశ్నించారు. పూర్తిస్థాయిలో నాణ్యతతో, ఇబ్బందులు తలెత్తకుండా త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రమాదాలు జరగకుండా తూతూమంత్రంగా ఏర్పాటుచేసిన రక్షణ చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం పర్యవేక్షించాలని, సత్వరం పూర్తయ్యేలా చూడాలన్నారు. జీవీఎంసీ వర్క్ ఇన్ ప్రోగ్రెస్ బోర్డులను ప్రజలకు అవగాహన కలిగేలా వెంటనే ఏర్పాటు చేయాలని కార్యనిర్వాహక ఇంజనీర్ గంగాధర్‌కు సూచించారు. జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు నాయుడు, సహాయ ఇంజనీర్ అప్పలనాయుడు తదితరులు కమిషనర్ వెంట ఉన్నారు.

రైతు బజారును సందర్శించిన ఉద్యానశాఖాధికారి



రైతులతో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారి భాను

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ రైతు బజారును ఉద్యాన శాఖ అధికారి భాను శుక్రవారం సందర్శించారు. రైతు బజారులోని సబ్జీ కూలర్ల పనితీరు, వాటి వినియోగంపై రైతులతో మాట్లాడారు. రైతులు అక్టోబరు పదిలోగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని తెలిపారు. ఉద్యాన శాఖ అందించే రాయితీలు, విత్తనాలు, పంటలను ఆశించే చీడపీడలకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు. రైతులు వారి అవసరాలకు ఆయా మండల ఉద్యాన శాఖ అధికారి లేదా గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో రైతు బజారు ఎస్టేట్ అధికారి వరహాలు, సహాయకుడు కనకరాజు, జిల్లా లీగల్ అథారిటీ ప్రతినిధి శ్రీలక్ష్మి, పారా లీగల్ వలంటీర్ భవానీ తదితరులు పాల్గొన్నారు.

పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్‌తో సమావేశం



మాట్లాడుతున్న జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి రామలక్ష్మి

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కోవిడ్ సమయంలో తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయిన పిల్లలతో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కేవీ రామలక్ష్మి శుక్రవారం సమావేశమయ్యారు. ఎంవీపీ కాలనీలోని స్త్రీ, శిశు సంక్షేమ అభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో 26 మంది లబ్ధిదారులు తమ సంరక్షకులతో కలసి హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ గార్డియన్‌గా ఉన్న పిల్లలతో మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితి, విద్యాస్థితిపై ఆరా తీశారు. పిల్లలకు హితబోధ చేశారు. పథకం వినియోగించుకుని సమాజంలో ఉన్నత స్థానాలకు చేరాలని ఉద్బోధించారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి కె.హరికృష్ణ, మిషన్ కో ఆర్డినేటర్ సంతోషి, ప్రొటెక్షన్ ఆఫీసర్ దాసరి చంద్రశేఖర్, మమత, కౌన్సిలర్ శంకుంతల తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ శ్రేణులపై దాడిచేస్తే డిజిటల్ బుక్‌లో నమోదు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కేకే రాజు, తదితరులు

మద్దిలపాలెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) వైసీపీ శ్రేణులపై దాడిచేసే వారిని గుర్తించి, వారి పేర్లను నమోదు చేయడానికి డిజిటల్ బుక్ తీసుకొచ్చామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పేర్కొన్నారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో శనివారం డిజిటల్ బుక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వేధింపులకు గురిచేస్తే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి వారి పేర్లు నమోదు చేస్తే, వైసీపీ అధికారంలోకి వచ్చాక చర్యలు తీసుకుంటామన్నారు. వార్డు కమిటీలకు గుర్తింపుకార్డులిస్తామన్నారు. కార్యక్రమంలో మొల్లి అప్పారావు, వాసుపల్లి గణేష్‌కుమార్, మాజీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జహీర్ అహ్మద్, వెంకట్రామయ్య, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఆవరణలో లైట్లు ఏర్పాటు



కళాశాల ఆవరణలో విద్యుత్ లైట్ల ధగధగలు

భీమునిపట్నం,సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎట్టకేలకు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. 1984లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో డిగ్రీ కళాశాలను ప్రారంభించారు. అనంతరం సమీపంలోని బిల్లలమెట్టలో ప్రభుత్వం స్థలం మంజూరు చేయడంతో అక్కడ సొంత భవనాలు నిర్మించారు. 1997లో కళాశాలను అక్కడికి మార్చారు.కళాశాల భవనాలకు విద్యుత్ సదుపాయం ఉన్నా. ఆవరణలో లైట్లు లేక పాతికేళ్లుగా అంధకారం నెలకొంది. ఈనేపథ్యంలో కళాశాల పూర్వ విద్యార్థులు జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పుడు, సర్పంచ్ వెంకటనారాయణ ఈ సమస్యను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. గంటా ఆదేశాల మేరకు జడ్పీ అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో అధికారులు కళాశాల ఆవరణలో ఐదు లైట్లు ఏర్పాటు చేశారు. దీంతో కళాశాల ఆవరణ విద్యుత్ వెలుగులతో ధగధగ మెరిసిపోతోంది.


సీతంపేటలో మహిషాసుర మర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన దుర్గాదేవి అమ్మవారు


డాబాగార్డెన్స్‌లోని శివరామకృష్ణ దేవాలయంలో లలితా త్రిపుర సుందరీదేవిగా ఉమాదేవి


రెడ్డికంచరపాలెంలో ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు


సీతమ్మధారలో ఆంజనేయ స్వామిగా దర్శనమిస్తున్న వేంకటేశ్వర స్వామి

విభిన్న అవతారాల్లో 'దేవి' దర్శనం



వన్‌టౌన్‌లోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో కుంకుమార్చనలలో పాల్గొన్న మహిళలు, శ్రీబాలాజీగా కన్యకాపరమేశ్వరిమాత అలంకరణ

మహారాణిపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీకన్యకా పరమేశ్వరీ ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆరో రోజు శనివారం శ్రీబాలాజీగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారి మూల విరాట్‌కు పాలు, పెరుగు, గంధం, పసుపు, కుంకుమ, సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో కలిపి 108 ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పూలతో అమ్మవారిని శ్రీబాలాజీగా అలంకరించి భక్తులకు దర్శన అవకాశం కల్పించారు. సాయంత్రం దేవాలయంలో 350 మంది మహిళలతో వాసవి కనకదుర్గకు కోటి కుంకుమార్చనలు, హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేయటంతో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆదివారం కన్యకాపరమేశ్వరీ అమ్మవారు త్రిశక్తి రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

లలితా త్రిపుర సుందరీదేవి అవతారంలో ఉమాదేవి

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డాబాగార్డెన్స్‌లోని దేవదాయ శాఖ పర్యవేక్షణలో ఉన్న శ్రీ శివరామకృష్ణ ఆలయంలో ఉమాదేవి అమ్మవారు శనివారం లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి సాయంత్రం హారతులిచ్చారు. ఆలయ ఈవో జీవీ రమాబాయి ఏర్పాట్లు పర్యవేక్షించారు. పరిసర ప్రాంత ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. సామూహిక అభిషేకాల్లో మహిళలు పాల్గొన్నారు. ఆలయ ఉద్యోగి జి.మన్మథరెడ్డి, అర్చకులు భార్గవశర్మ కార్యక్రమాలను పర్యవేక్షించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

కంచరపాలెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రులు ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగన్ననగర్, తిక్కవానిపాలెం, రెడ్డి కంచరపాలెం, గొల్ల కంచరపాలెం, సన్‌రైజ్ క్లబ్, వివేకానందవీధి, దుర్గానగర్, ఐటీఐ జంక్షన్ తదితర ప్రాంతాల్లో అమ్మవారికి విశిష్ట పూజలు నిర్వహించారు. అన్ని ఆలయాల వద్ద హోమం నిర్వహించి మానవాళికి మంచి జరగాలని ప్రార్థించారు. పలుచోట్ల భక్తులకు అన్నదానం నిర్వహించారు.

మహిషాసుర మర్దిని అమ్మవారి అలంకరణలో దుర్గాదేవి

సీతమ్మధార, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్స్‌లో గల షిరిడి సాయిబాబా, వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప స్వామి ఆలయంలో దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఈఓ బండారు ప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం దుర్గాదేవి అమ్మవారిని మహిషాసుర మర్దిని అలంకరణలో దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేంకటేశ్వర స్వామి ఆంజనేయస్వామి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

శమీ పూజకు అప్పన్న పూదోట ముస్తాబు


సింహాచలం వరాహలక్ష్మీనరసింహస్వామి పూదోట

సింహాచలం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో వచ్చేనెల రెండో తేదీన నిర్వహించనున్న శమీ పూజోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. చెడుపై మంచి విజయానికి గుర్తుగా ఏటా విజయదశమి రోజున ఈ ఉత్సవం నిర్వహించడం సంప్రదాయం. దీంతో పూదోటను శుభ్రపరచి గోడలకు, మండపానికి రంగులద్దుతున్నారు. శమీ వృక్షం వద్ద పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, మెట్ల మార్గం రాళ్ల, నీటితడి, లేకుండా శుభ్రపరుస్తున్నారు. పల్లకిలో స్వామివారిని మెట్లమార్గంలో తీసుకువచ్చి పూదోటలో శమీ పూజోత్సవం తరువాత రాజాలంకారంలో అశ్వ వాహనంపై మాడవీధుల్లో తిరువీధి ఉత్సవాన్ని నిర్వహిస్తారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న స్వాములు

సింహాచలం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామికి ఆర్జిత నిత్య కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయదేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై ఉంచారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

పట్టాలెక్కిన బ్రహ్మపుర-సూరత్ రైలు


కొత్త రైలు బోగీలో పరిశీలిస్తున్న లలిత్ బొహ్రా

విశాఖపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మపుర-సూరత్ (ఉధ్నా) మధ్య రాకపోకలు సాగించే విధంగా ప్రవేశపెట్టిన కొత్త అమృతభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు శనివారం పట్టాలెక్కింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఝార్సుగుడ స్టేషన్ నుంచి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వాల్తేరు డివిజన్ డీఆర్ఎం లలిత్ బొహ్రా విశాఖ రైల్వే స్టేషన్‌లో మాట్లాడుతూ ఆంధ్ర-ఒడిశా ప్రాంతాలకు సంబంధించి ఇది రెండో అమృతభారత్ ఎక్స్‌ప్రెస్ అని పేర్కొన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ మీదుగా నడుస్తుందన్నారు. ఒడిశా, ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలను అనుసంధానం చేస్తూ భారతీయ రైల్వే ప్రవేశపెట్టిన కొత్త రైలు ప్రయాణికుల అవసరాలను తీరుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ రైలు సర్వీసులు అక్టోబరు 5 నుంచి పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తాయని డీఆర్ఎం తెలిపారు.

నేటి నుంచి శిల్పారామంలో దసరా ఉత్సవాలు

మధురవాడ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మధురవాడ శిల్పారామంలో ఆదివారం నుంచి వచ్చే నెల 2 వరకు దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్టు పరిపాలనాధికారి తెలిపారు. రోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆదివారం మీనాక్షి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ కళాకారుల కూచిపూడి ప్రదర్శన, సోమవారం సరస్వతీ నృత్యాలయం కళాకారుల జానపద నృత్యం ఉంటాయని చెప్పారు. మంగళ, బుధ, గురువారాల్లోనూ ప్రదర్శనలుంటాయన్నారు.

'ది డెక్'లో మిట్టల్ ఆఫీస్?

... 7వ పేజీ తరువాయి

వాహనాల్లో వచ్చే భవనాలు ఏమీ లేవు. దాంతో బేస్‌మెంట్‌లో పార్కింగ్ కోసం కేటాయించిన మూడు అంతస్థులు సరిపోతాయని భావిస్తున్నారు. వాటిలో 300 కార్లు, మరో 200 ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసుకోవచ్చు. అంతకు మించిన డిమాండ్ ఉండదనే భావనతో పార్కింగ్ కోసం ఉద్దేశించిన రెండో అంతస్థును ఆఫీస్‌గా మార్చాలని నిర్ణయించారు.

సింహాచలం ట్రస్ట్ బోర్డుపై కసరత్తు

... 7వ పేజీ తరువాయి

ఉన్నవారు ఇతర ఏ కార్యకలాపాల్లోను కీలకంగా ఉండకూడదని నిబంధనలు చెబుతున్నాయి. దీనివల్ల ఆయన అక్కడ గవర్నర్‌గా, ఇక్కడ చైర్మన్‌గా కొనసాగడానికి సాంకేతికంగా అవకాశం లేదని అంటున్నారు. ఆయన కూడా ట్రస్ట్ బోర్డు నియామకంపై పెద్దగా ఆసక్తి చూపడం లేదని సమాచారం. గతంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు కొందరు అంతా తామై వ్యవహరించి, ఆలయ పరిపాలనా వ్యవహారాలకు అడ్డం పడిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బోర్డు అవసరం లేదని ఆయన అభిప్రాయపడుతున్నట్టు తెలిసింది. అయితే పార్టీ అధికారంలో ఉన్నందున ఇలాంటి నియామకాలు అవసరం కాబట్టి ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. 22 మందితో బోర్డును ఏర్పాటు చేయడానికి ఫైల్ సిద్ధం చేశారు.

ఆర్టీసీకి దసరా తాకిడి

... 7వ పేజీ తరువాయి

కిటకిటలాడింది. బస్సులన్నీ కిక్కిరిసిపోయాయి. ఉత్తరాంధ్ర నుంచి దూర ప్రాంతాలకు వెళ్లాలన్నా, దూరప్రాంతాల నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు రావాలన్నా విశాఖ ద్వారకా బస్‌స్టేషన్ ట్రాన్సిట్ పాయింట్‌గా ఉంటుంది. దాంతో కాంప్లెక్స్ ప్రయాణికులతో రద్దీగా మారింది. ఉదయం నుంచి రాత్రి 9.00 గంటల వరకూ ఇదే పరిస్థితి కొనసాగింది. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు అధికారులు ఎప్పటికప్పుడు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశారు.

కారు జోరు

... 7వ పేజీ తరువాయి

పెద్దఎత్తున బుకింగ్స్ వస్తుంటాయి. మారుతీ సుజుకీ కంపెనీ వివిధ మోడల్ కార్లు సాధారణ రోజుల్లో జిల్లాలోని అన్ని షోరూమ్‌లలో కలిపి పది నుంచి 12 వరకూ విక్రయిస్తుంటుంది. దసరాకు ముందు అయితే ఈ సంఖ్య మరో ఎనిమిది వరకూ పెరుగుతుంది. అంటే, 20 కార్లను విక్రయిస్తుంటారు. కానీ, ఈ నెల 22 నుంచి అనూహ్యంగా విక్రయాలు పెరిగినట్టు వరుణ్ మోటార్స్ ప్రతినిధులు చెబుతున్నారు. ప్రతిరోజూ కనీసం 60 నుంచి 70 వరకూ జిల్లాలో విక్రయిస్తున్నారు. ఇందులో అత్యధికం స్విఫ్ట్, డిజైర్, వేగనార్, బ్రెజా ఉన్నాయి. హ్యుండయ్ కంపెనీకి చెందిన కార్ల విక్రయాలు కూడా అలాగే ఉన్నాయి. క్రెటా కారు అత్యధికంగా సేల్ అవుతున్నట్టు ఆ సంస్థకు చెందిన ప్రతినిధులు వెల్లడించారు. సాధారణ రోజుల్లో నాలుగు షోరూమ్‌లల్లో పది కార్లను విక్రయిస్తే..జీఎస్టీ తగ్గిన తరువాత నుంచి 25 నుంచి 30 వరకు విక్రయిస్తున్నట్టు చెబుతున్నారు. టాటా, మహీంద్ర వంటి కంపెనీలకు చెందిన కార్ల విక్రయాలు కూడా రెట్టింపు అయినట్టు చెబుతున్నారు.

పెరిగిపోతాయన్న ప్రచారమూ..

జీఎస్టీ మార్పుతో కార్ల ధరలు ఊహించని రీతిలో తగ్గాయి. అదే సమయంలో దసరా పండగ నేపథ్యంలో కార్ల కంపెనీలు ఆఫర్లను అందిస్తున్నాయి. కారు మోడల్‌ను బట్టి లక్ష రూపాయలు నుంచి రూ.2.5 లక్షల వరకు తగ్గుతోంది. కొద్దిరోజుల తరువాత తగ్గిన జీఎస్టీ రేట్లకు అనుగుణంగా కంపెనీలు ధరలు పెంచేస్తాయన్న ప్రచారమూ డిమాండ్ పెరగడానికి కారణంగా చెబుతున్నారు.

వ్యర్థాల వినియోగంపై ప్రజలకు అవగాహన


మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు భరణికాన రాజు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 45వ వార్డులోని పలు ప్రాంతాల్లో వ్యర్థాల వినియోగం (జీరో వేస్ట్ ఇనీషియేటివ్స్, వేస్ట్ టు ఆర్ట్ ఇన్‌స్టాలేషన్) అనే అంశాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీడీపీ వార్డు అధ్యక్షుడు భరణికాన రాజు మాట్లాడుతూ స్థానికులు తమ నివాసంలో ఉపయోగించని ఉత్పత్తులను, ఖాళీ సీసాలను అందమైన పూల కుండీలకు ఉపయోగించవచ్చన్నారు. ఉపయోగించని దుస్తులను డోర్ మ్యాట్లుగా, గుడ్డ సంచుల తయారీకి ఉపయోగించవచ్చని పేర్కొన్నారు. జీరో వేస్ట్ చొరవ కోసం పొడిచెత్తను కంపోస్ట్ చేయడానికి తడి వ్యర్థాలను ఉపయోగించడం, వ్యర్థాలను రీసైకిల్ చేయడానికి, తిరిగి ఉపయోగించడానికి, కాలుష్యం నుంచి పర్యావరణాన్ని రక్షించడానికి వార్డుల్లో ఉన్న ఆర్ఆర్ఆర్ కేంద్రాలకు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, సచివాలయం సెక్రటరీలు అలిమా, ఫాతిమా, చారి తదితరులు పాల్గొన్నారు.

మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో ఉచిత వైద్యశిబిరం నేడు

మురళీనగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో ప్రత్యేక ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ తెలిపారు. అపోలో ఆసుపత్రి సిబ్బంది వైద్య సేవలు అందిస్తారని అన్నారు. ఆదివారం ఉదయం 6.30 నుంచి 10 గంటల వరకు శిబిరం జరుగుతుంది. మాధవధార మహిళా వాకర్స్‌క్లబ్ సంయుక్త భాగస్వామ్యంతో జరిగే ఈ శిబిరంలో నగరంలోని ప్రముఖ కార్డియాలజిస్ట్ డి.కె.బారువా, అనురాధ రెడ్డి అందించే సేవల్ని వినియోగించుకోవాలని కోరారు.

మతిస్థిమితం లేని యువతి అప్పగింత

సీతంపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధి రైల్వే స్టేషన్ గేట్ నెంబర్ 1 పరిసరాల్లో మతిస్థిమితం లేని ఒక యువతి తిరుగుతూ ఉంది. ఈ సమాచారం నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ ఉమాకాంత్‌కి తెలియడంతో సిబ్బందితో వెళ్లి ఆ యువతి వివరాలు సేకరించి వారి కుటుంబ సభ్యులను పిలిపించి ఆమెను అప్పగించారు.

మహిళా రచయితల సాహిత్య కృషిపై 8, 9 తేదీల్లో జాతీయ సదస్సు

జ్ఞానాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ కళాశాల భాషా విభాగాల ఆధ్వర్యంలో స్వాతంత్ర్యానంతర తెలుగు-హిందీ సాహిత్యంలో 'మహిళా రచయితల సాహిత్య కృషి' అనే అంశంపై అక్టోబరు 8, 9 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. కళాశాలలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. రెండు రోజులు జరిగే ఈ సదస్సుకు దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల ఆచార్యులు విచ్చేసి హిందీ, తెలుగు భాషల్లో మహిళా రచయితల సాహిత్య కృషిపై ప్రసంగిస్తారని కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.కె.జయలక్ష్మి పేర్కొన్నారు. ఈ బ్రోచర్ ఆవిష్కరణలో డాక్టర్ నిర్మల, డాక్టర్ ఎస్.దీప్తి, డాక్టర్ కోటేశ్వరరావు, వెంకటరత్నం పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉంటేనే మంచి భవిష్యత్తు

▸▸ వన్‌టౌన్ సీఐ దేముడుబాబు సూచన


వైద్యవిద్యార్థులతో కలిసి చేపట్టిన ర్యాలీలో మాట్లాడుతున్న వన్‌టౌన్ సీఐ జి.దేముడుబాబు

మహారాణిపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులు ర్యాగింగ్ వంటి అనుచిత చర్యలకు పాల్పడకూడదని, చదువులో ముందుకు సాగుతూ మంచి భవిష్యత్తును రూపుదిద్దుకోవాలని వన్‌టౌన్ సీఐ జి.దేముడు బాబు సూచించారు. ఆంధ్ర వైద్య కళాశాలలో వైద్య విద్యార్థులకు ర్యాగింగ్ నిరోధం, మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే విద్యార్థులు తమ జీవితాలనే పణంగా పెట్టే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందన్న విషయం గుర్తుంచుకోవాలని తెలిపారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని హితవు పలికారు. వైద్య కళాశాల, కేజీహెచ్ ప్రాంగణాల్లో నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనాటమీ విభాగాధిపతి డాక్టర్ కిషోర్, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, పెద్దసంఖ్యలో వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

కష్టపడిన కార్యకర్తలకు అండ: వంశీకృష్ణ


ఎమ్మెల్యే వంశీకృష్ణతో జనసేన పార్టీ నాయకులు

మహారాణిపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేలా కృషి చేయాలని దక్షిణ నియోజకవర్గం శాసన సభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. శనివారం మహారాణిపేట 29వ వార్డు జనసేన పార్టీ నాయకులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు పెద్దపీట వేసేలా చర్యలు చేపట్టాలని, కష్టపడిన కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అందరూ కలసికట్టుగా పనిచేసి సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. క్రియాశీలక సభ్యత్వ నమోదు, బీమా సౌకర్యం కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు గొలగాని రవీశ్వరరావు, 29వ వార్డు అధ్యక్షుడు అంగటి శ్రావణకుమార్, మన్యాల శ్రీనివాస్, బుద్దల అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణ సమయంలో విలువైన వస్తువులు జాగ్రత్త


ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజు

సీతంపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా సొంత ఊళ్లు వెళ్లేవారు ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఇంటికి తాళం వేస్తే పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ద్వారకా పోలీసు స్టేషన్ క్రైమ్ ఎస్ఐ రాజు సూచించారు. దొంగతనాలు, నేరాలపై ద్వారకా పోలీసు స్టేషన్ పరిధి ఎస్‌వీటీ కూడలిలో శనివారం అవగాహన కల్పించారు. ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలు, నగదు బ్యాంక్ లాకర్‌లో భద్రపరుచుకోవాలని, ఇంటికి తాళం వేస్తే ఇంటి పక్క వారికి తెలియచేసి, వస్తువులన్నిటిని జాగ్రత్తగా దాచుకోవాలని సూచించారు. ఎవరిపై అనుమానం ఉన్నా తక్షణమే 112కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ రాజు సూచించారు.

వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి


అల్లిపురం ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కార్పొరేటర్ కందుల నాగరాజు

అల్లిపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'ఆరోగ్యవంత మహిళ..శక్తివంతమైన కుటుంబం' కార్యక్రమంలో భాగంగా 32వవార్డులోని అల్లిపురం పట్టణ ఆరోగ్యకేంద్రాన్ని శనివారం వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు సందర్శించి పలు సూచనలు చేశారు. అక్కడ జరుగుతున్న అభ ఐడి రిజిస్ట్రేషన్‌లు పరిశీలించి ఏఎన్ఎంలు చేస్తున్న సేవలను గమనించారు. ముఖ్యంగా పీఎంజేఏవై పై గర్భిణులకు ప్రభుత్వం అందించే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. డాక్టర్ డా.ఆర్.అల్తా, డాక్టర్ సాయికుమార్, డాక్టర్ పంటాకు రవికుమార్, డాక్టర్ సి.నిఖిల్, కందుల కృష్ణ పాల్గొన్నారు.

ఐక్యంగా ముందుకు సాగుదాం


దసరా బహుమతులు అందజేస్తున్న వెల్ఫేర్ సంఘం ప్రతినిధులు, సభ్యులు

సీతమ్మధార, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెంలో గల గణేష్ సాయి దుర్గా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దసరా బహుమతుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. సంఘం నిర్వాహకులు, నక్కవానిపాలెం గ్రామ కమిటీ అధ్యక్షుడు కాటారాజు రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ ఐక్యంగా ఉండేందుకు వీలుగా సంఘం ఏర్పాటు చేసి ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బర్ల బాలకృష్ణ, పూర్వ గ్రామ అధ్యక్షుడు డీవీఎస్ ప్రసాద్ రెడ్డి, కారపు శ్యామలరావు, దుంగి దిలీప్‌రెడ్డి తదితరులు సంఘం సభ్యులకు బహుమతులు అందచేశారు.

కూలుతున్న నూతన నిర్మాణాలు!

▸▸ స్మార్ట్ వైజాగ్ ఇంజనీరింగ్ అధికారుల తీరుపై విమర్శలు


ఒరిగిపోయిన బర్మాక్యాంప్ ఫైర్ ఆఫీస్ ప్రహరీ, బీటలు వారిన 11 అడుగుల ఎత్తైన ప్రహరీ కట్టడం

మురళీనగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గంలో జరుగుతున్న పలు నిర్మాణాల్లో ఇంజనీరింగ్ అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. కట్టడాల్లో నాణ్యత, డిజైనింగ్ ఖరారులో ఎక్కడా ప్రమాణాలు పాటించడం లేదని తేటతెల్లమవుతోంది. ఇవేం అభివృద్ధి పనులంటూ ప్రజానీకం నివ్వెరపోతోంది. జీవీఎంసీ 49వవార్డు కామాక్షినగర్‌లో నిర్మించిన అగ్నిమాపక కార్యాలయం ప్రహరీ ఇందుకు ప్రబల ఉదాహరణ. రూ.20 లక్షలతో గత నెలలోనే నిర్మించిన ప్రహరీ రోజుల వ్యవధిలోనే ఒరిగిపోయింది. 11 అడుగుల ప్రహరీ బీటలు వారి నేల కొరిగేలా ఉంది. ప్రహరీ కట్టిన ప్రదేశంలో వందేళ్ల నాటి మహావృక్షం అడ్డం వస్తే దానిని పాక్షికంగా తొలగించి పని పూర్తి చేశారు. 11 అడుగుల ఎత్తులో కట్టిన గోడ మధ్య మధ్యలో కాంక్రీట్ పిల్లర్లు వేసి వాటిని అనుసంధానిస్తూ నిర్మించారు. వైసీపీ ప్రభుత్వం 2023లో కేటాయించిన రూ.20 లక్షలు చాలవని కాంట్రాక్టర్లు పనులు చేపట్టడానికి ఆసక్తి చూపలేదు. 2025 జూలైలో ఆ నిధులతో అవకాశం ఉన్నంతవరకు నిర్మాణం పూర్తి చేయాలని జీవీఎంసీ జోన్-5 జ్ఞానాపురం కార్యాలయ అధికారులు ఒత్తిడి చేయడంతో పనులు చేపట్టినట్లు ప్రహరీ పూర్తిచేసిన కాంట్రాక్టరు పేర్కొన్నారు!

ఇది గోడ కట్టే విధానమే కాదు

బర్మాక్యాంప్ మెయిన్ రోడ్డులో ఉన్న ఫైర్ ఆఫీసు స్థలం ఆక్రమణకు గురికాకుండా గోడ నిర్మాణానికి వైసీపీ హయాంలో రూ.20 లక్షలు కేటాయించారు. జోన్-5 డిప్యూటీ ఇంజనీరింగ్ అధికారుల జోక్యంతో పనులు ఈ ఏడాది జూలైలో ఆరంభించారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు భూమిపూజచేశారు. నెల రోజుల్లోనే పని పూర్తి చేసేశారు. ప్రహరీకి ఫైర్ ఆఫీస్ లోపలి నుంచి ఎర్రమట్టిని నింపారు. అదీ తవ్వకాల్లో పని ప్రదేశంలో తవ్విన మట్టే. ఈ కొత్త ప్రహరీకి దిగువన ఆరు ఇళ్ల ఉన్నాయి. కొండ ప్రాంతం కావడంతో అక్కడ వందేళ నాటి మహా వృక్షం ఉండేది. దానిని అతి కష్టంమీదతొలగించి చెట్టు మొదలు నుంచే గోడ కట్టేశారు. ఇపుడు వృక్షం చిగురించడం, వేర్లు బలపడి ఉన్న ప్రాంతం మేరకు గోడ దెబ్బతింటుందన్న అనుమానాలతో కట్టిన గోడను కూల్చేశారు. ఎగువన ప్రహరీ గోడ లోపలి నుంచి ఎర్రమట్టితో నింపడంతో నివాసితుల ఇళ్ల వైపు బీటలు వారి ఒరిగి పోయిందని స్థానికులు పేర్కొన్నారు. పూర్తయిన నిర్మాణాన్ని ఇపుడు కూలదోసి మళ్లీ కడతామని చెబుతున్నారు. ఈ చిందరవందర పనులపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. 49వ వార్డులోనే ఇటీవల చేపట్టిన మాణిక్యాంబ కాలనీలో గెడ్డ రక్షణగోడ పనులు కూడా నాసిరకంగా ఉన్నాయి. ఈ దారిలో ప్రయాణించే వారికి పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది. గెడ్డ పక్కగా వేసిన పాత రోడ్డంతా సిమెంట్ క్రషరు, ఇసుకతో నిండింది. ప్రమాదవశాత్తూ జారి పడితే నేరుగా గెడ్డలోకే పోతామని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక రాజకీయ నాయకులు స్పందించడం లేదని మాణిక్యాంబకాలనీ నివాసితులు వాపోతున్నారు!


మాణిక్యాంబ కాలనీలోరోడ్డుకు సమాంతరంగా పునర్నిర్మించిన రిటైనింగ్ వాల్‌తో ప్రయాణికులకు రక్షణ కరువు...



ధర్నాలో మాట్లాడుతున్న కార్మిక నేత అయోధ్యరామ్

స్టీల్ ప్లాంట్ అడ్మిన్ భవనం వద్ద ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటును ఈవోఐ పేరుతో కేంద్ర ప్రభుత్వం, నిర్వీర్యం చేస్తుందని, యాజమాన్య నిర్ణయాన్ని కార్మిక వర్గం వ్యతిరేకిస్తుందని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు. నక్కపల్లి వద్ద మిట్టల్ స్టీల్ ప్లాంట్ నిమిత్తం ప్రజాభిప్రాయ సేకరణకు వ్యతిరేకంగా శనివారం ప్లాంట్ అడ్మిన్ భవనం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించాలని, ప్రైవేటీకరణ నిర్ణయాన్ని పూర్తిగా నిలిపివేసి, ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా పలు విభాగాల్లో ప్రవేశపెట్టిన ఈవోఐ నిర్ణయాన్ని ఉపసంహించుకోవాలన్నారు. ఈవోఐల వల్ల ప్లాంట్ ప్రమాదంలో పడుతుందన్నారు. ప్రైవేటీకరణ చేయబోమని కేంద్రం ప్రకటన చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని కోరారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణే ధ్యేయంగా తాము ముందుకు సాగుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జె.అయోధ్యరాం, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కేఎస్ఎన్ రావు, వైటీ దాసు, యు.రామస్వామి, రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కృష్ణంరాజు సేవలు అభినందనీయం

అగనంపూడి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా ప్రైవేటు క్లినిక్‌ను ఏర్పాటు చేసి పేదలకు ఉచితంగా వైద్య సేవలందిస్తున్న డాక్టర్ కృష్ణంరాజును శనివారం స్థానిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అగనంపూడి, పరిసర ప్రాంతాల్లోని పేదలకు డాక్టర్ కృష్ణంరాజు ఉచిత సేవలు అందిస్తుండడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో సంఘాల ప్రతినిధులు కరణం పైడిరాజు, చిత్తా రామారావు, గణేశ్, తాతారావు, బొర్రమాంబ పారాయణ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

అగనంపూడి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని పెందుర్తి క్లస్టర్ సీడీపీవో నీలవేణి అన్నారు. 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చెల్లాయ్యమ్మ, అంగన్‌వాడీలు విజయకుమారి, సాయిసరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ఓజి** : మెలోడి, శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, శరత్, లీలామహల్, శ్రీరామ, కిన్నెర, కామేశ్వరి, గోకుల్, వెంకటేశ్వర-1,2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కిందపురి** : శ్రీరామా, నరసింహ (గోపాలపట్నం), (గాజువాక),
- **ఘాటీ** : గోకుల్, ముక్తాస్, (గాజువాక)
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 25, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 28, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 40, బీరకాయలు 30, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 40, దొండకాయలు 36, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 70, బరబాటి 34, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 50, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 56, కీరదోస 32, కాప్సికమ్ 52, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 44, దేముడు చిక్కుడు 60, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 80, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	115
లైవ్ ధర	130
విత్ స్కిన్	240
స్కిన్‌లెస్	250


70వ వార్డు టీవీఎన్ కాలనీలోని డ్రైనేజీ సమస్యను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు వివరిస్తున్న స్థానికులు, టీడీపీ వార్డు నాయకులు


87వ వార్డు సిద్దార్థనగర్‌లోని వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, తదితరులు

70, 87 వార్డుల్లో కమిషనర్ ఆకస్మిక పర్యటన

» సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చిన కేతన్ గార్గ్

కూర్మన్నపాలెం/ఆటోనగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) కమిషనర్ కేతన్ గార్గ్ శనివారం 70, 87 వార్డుల్లో ఆకస్మిక పర్యటన చేశారు. ముందుగా ఆయన 70వ వార్డు పరిధి టీవీఎన్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో పాటు టీడీపీ వార్డు అధ్యక్షుడు కేవీఎస్ శంకర్రావు, నాయకుడు పీఎంఎల్ నాయుడు టీవీఎన్ కాలనీని ఆనుకుని ఉన్న మురుగు నీటి కాలువ సమస్య నాలుగు దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోవడం లేదని కమిషనర్‌కు వివరించారు. వర్షం కురుస్తే మురుగు బయటకు వెళ్లేందుకు సరైన డ్రైనేజీ వ్యవస్థ కాలువ పొంగిపోయి కాలనీలోని రోడ్లపైకి, ఇళ్లలోకి వచ్చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం భరించరాని దుర్వాసనతో అల్లాడుతున్నామని, దోమల విజృంభిస్తుండడంతో వృద్ధులు, చిన్నారులు తరచూ రోగాల బారినపడుతున్నారని, అందువల్ల ఈ సమస్యను పరిష్కరించవలసిందిగా కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. అందుకు స్పందించిన కేతన్ గార్గ్ త్వరితగతిన సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం ఉందన్నారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం కమిషనర్ 87వ వార్డు పరిధి సిద్ధార్థ నగర్‌లో పర్యటించారు. కేతన్ గార్గ్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ సిద్ధార్థ నగర్‌లోని 12ఎంఎల్‌డీ వాటర్ ప్లాంట్‌కు తీసుకువెళ్లి అక్కడ మోటార్ల పనితీరు, మరమ్మతుల సమాచారం, పంప్ హౌస్ అభివృద్ధి, మరో 12 ఎంఎల్‌డీ వాటర్ ప్లాంట్ ఆవశ్యకత, నీటి శుద్ధి, తరచూ తాగునీటి పంపిణీలో చోటుచేసుకుంటున్న సమస్యలను వివరించారు. పంప్ హౌస్‌కు సమీపంలో నాలుగున్నర ఎకరాల స్థలంలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం, తిరుమల నగర్ నుంచి హైవేకు రహదారి నిర్మాణం, కణితి నుంచి హైవేకు గెడ్డల విస్తరణ పనులు చేపట్టాలని కమిషనర్‌కు తెలియజేశారు. ఆయా సమస్యలను త్వరితగంగా పరిష్కరించాలని కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట జడ్సీ బీఆర్ఎస్ శేషాద్రి, ఏఎంవోహెచ్ కిరణ్‌కుమార్, నీటి విభాగ అధికారులు, టీడీపీ నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, మాటూరి రాము, రాజన్‌రాజు, టీవీఎన్ కాలనీవాసులు పి.మహాలక్ష్మీనాయుడు, రూపా జ్యోతి, కృష్ణవేణి, పారిశుధ్య, సచివాలయ సిబ్బంది ఉన్నారు.


70వ వార్డు డ్రైవర్స్ కాలనీలో లలితాదేవి అలంకరణలో కనకదుర్గమ్మ


ఉక్కు టౌన్‌షిప్ త్రిశక్తి ఆలయంలో ధనలక్ష్మిగా మహాలక్ష్మి అమ్మవారు


అగనంపూడి పోస్టాఫీసు వద్ద లలితాత్రిపురసుందరీదేవిగా దుర్గమాంబ


నడుపూరు నూకాంబిక ఆలయంలో పూజలందుకుంటున్న దుర్గాదేవి

లలితాదేవి నమస్తుతే..

» శరన్నవరాత్రి ఉత్సావాల్లో భాగంగా దుర్గాదేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 27: శరన్నవరాత్రి ఉత్సవాలను పలు ప్రాంతాల్లో వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం కనకదుర్గమ్మ శ్రీలలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్‌లోని త్రిశక్తి ఆలయంలోని మహాదుర్గ అమ్మవారిని శ్రీలలితాత్రిపుర సుందరిగా, శ్రీమహాలక్ష్మిని ధనలక్ష్మిగా, శ్రీమహాసరస్వతిని నాగేశ్వరీదేవిగా అలంకరించి ప్రధాన అర్చకులు ఫణిశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవార్లను దర్శించుకున్నారు.

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 70వ వార్డు పరిధి ఎల్వీనగర్‌లో గల శ్రీకనక దుర్గమ్మ ఆలయంలోని అమ్మవారిని శ్రీలలితాదేవిగా అలంకరించి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. డ్రైవర్స్ కాలనీలోని కనకదుర్గమ్మ ఆలయంలోని అమ్మవారిని శ్రీలలితాదేవిగా అలంకరించి పూజలు జరిపారు. సామూహిక కుంకుమ పూజల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అగనంపూడి: స్థానిక పోస్టాఫీసు వద్ద గల దుర్గమాంబ శనివారం లలితాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని పసుపు కొమ్ములతో శోభాయమానంగా అలంకరించారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి ప్రతినిధులు లలిత, విష్ణుసహస్రనామ పారాయణాలను పఠించారు. అలాగే పెదమడక కొండపై గల దుర్గాదేవికి ఆలయంలో ధర్మకర్త బల్ల పైడిరాజు ఆధ్వర్యంలో పూజలు జరిపారు.

మల్కాపురం: స్థానిక ఎస్సీ కాలనీలో ప్రతిష్ఠించిన దుర్గాదేవికి ప్రజలు పూజలు చేస్తున్నారు. అలాగే స్థానిక యువకులు అక్టోబరు ఒకటి నుంచి దుర్గాదేవి ఉత్సవాలను చేపట్టేందుకు శనివారం పందిరిరాట వేశారు. పూజాది కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా యారాడ కొండపై వెలసిన సాగర గిరి కనకదుర్గమ్మను శనివారం భువనేశ్వరీదేవిగా అలంకరించగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

పెదగంట్యాడ: నడుపూరు నూకాంబికా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవికి కుంకుమపూజలు చేయగా, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.



ఫెస్టివల్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అరుంధతి, తదితరులు

10 నుంచి 'విజ్ఞాన్'లో టెక్రిడ్జ్-2కే25

అగనంపూడి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో అక్టోబరు 10 నుంచి రెండు రోజుల పాటు జాతీయ స్థాయి మహిళా టెక్నికల్ ఫెస్టివల్ (టెక్రిడ్జ్ 2కే25)ను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లు శనివారం కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ అరుంధతి విద్యార్థినులతో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినుల్లో నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, సాంకేతిక ప్రతిభను పెంపొందించాలనే లక్ష్యంతో ఏటా మాదిరిగానే ఈసారి కూడా ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించనున్నామన్నారు. ఫెస్ట్‌ను పురస్కరించుకుని వివిధ క్రీడా పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ మహేంద్రసాయి, కో-కన్వీనర్ లక్ష్మణరావు, సంతోశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

టీడీపీ లీగల్ సెల్ గాజువాక అధ్యక్షుడిగా రాము


ముమ్మడివరపు రాము

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడిగా 88వ వార్డు జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి చెందిన ముమ్మడివరపు రామును టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నియమించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించిన పల్లా శ్రీనివాసరావుకు, కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ బలోపేతానికి సైనికుడిలా శ్రమిస్తానని ఆయన పేర్కొన్నారు.



సీపీ శంఖబ్రత బాగ్చీని సత్కరించి జ్ఞాపికను అందజేస్తున్న కళాశాల ప్రతినిధులు

అవినీతి లేని సమాజం కోసం కృషి చేయాలి

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

మల్కాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అవినీతి లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అది విద్యార్థుల చేతుల్లోనే ఉందని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. శనివారం ఇక్కడి సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో నిర్వహించిన విజిలెన్స్ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మనం నిజాయితీగా ఉండడంతో పాటు ఎదుటవారు నిజాయితీగా ఉండేలా చూడాలన్నారు. అందరూ అవినీతి రహిత సమాజం కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం సీపీని కళాశాల ప్రతినిధులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హార్బర్ సర్కిల్ ఏసీపీ కాళిదాస్, మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంవీఆర్ కళాశాలలో పర్యాటక దినోత్సవం

గాజువాక, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రదేశాలను సందర్శించడం వల్ల జ్ఞానం, విజ్ఞానం పెరగడంతో పాటు వినోదం లభిస్తుందని డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు అన్నారు. ఇక్కడి ఎంవీఆర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఆయన ప్రారంభించ మాట్లాడారు. పర్యాటక ప్రదేశాలను సందర్శించి, అక్కడి మంచి విషయాలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి వి.రామారావు, కామర్స్ విభాగాధిపతి కామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సంచలనాలకు కేంద్రం ములగాడ తహశీల్దార్ కార్యాలయం

» 2013 నుంచీ కొనసాగుతున్న పరిస్థితి

» కార్యాలయంపై ఏసీబీ అధికారుల దృష్టి

మల్కాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ములగాడ తహశీల్దార్ కార్యాలయం సంచలనాలకు కేంద్రంగా మారింది. దీంతో ఇక్కడ సిబ్బంది పనిచేయడానికి భయపడుతున్నారు. గతంలోకి ఒకసారి తొంగిచూస్తే... 2013లో ఎదురువానిపాలెంలో ఆక్రమణలు తొలగించిన సందర్భంలో స్థానికులు మండల కార్యాలయ సిబ్బందిపై దాడిచేశారు. ఇది అప్పట్లో తీవ్ర సంచలనం రేపింది. పోలీసు కేసులు కూడా నమోదయ్యాయి. ఆ తరువాత శ్రీరామ్‌నగర్‌లో ప్రభుత్వ స్థలానికి సంబంధించి నిర్మించిన గోడను గుర్తు తెలియని వ్యక్తులు పడగొట్టిన ఘటనలో వీఆర్వో, వీఆర్ఏలను నాటి కలెక్టర్ సస్పెండ్ చేశారు. తరచూ ఈ కార్యాలయ సిబ్బందిపై కలెక్టర్‌కు ఫిర్యాదులు పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలోనే అప్పట్లో వీఆర్వోగా పనిచేసిన సంజీవ్‌కుమార్ ఇంటిపై ఏసీబీ అధికారులు దాడిచేసి, కేసు నమోదు చేశారు.



ములగాడలోని తహశీల్దార్ కార్యాలయం

తాజాగా ఇద్దరు ఉద్యోగులు ఏసీబీకి పట్టుబడడం సంచలనం రేపింది. చిన్న మండలమే అయినా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మండలంలో ఉన్నవే మూడు సర్వే నంబర్లు... అంతగా ప్రభుత్వ భూములు కూడా లేవు. ఉన్నవన్నీ కొండలే. 58వ వార్డు ఎదురువానిపాలెం, ములగాడలో కొంత ప్రభుత్వ భూ మి ఉంది. 59 నుంచి 63 వార్డుల వరకు అన్నీ కొండలే. వీటిపై జోరుగా ఆక్రమణలు చోటుచేసుకుంటున్నప్పటికీ తొలగిస్తుంటారు.


నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

తెలుగు యువత 'గాజువాక' కమిటీ ఏర్పాటు

గాజువాక, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలుగు యువత గాజువాక నియోజకవర్గ కమిటీ 18 మందితో ఏర్పాటైంది. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో శనివారం కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా మానాపురం గణపతిరావు, ప్రధాన కార్యదర్శిగా వియ్యపు నరేశ్, ఉపాధ్యక్షులుగా తుంపాల రమేష్, టేకేటి అప్పలరాజు, కంచిపాటి అప్పలరాజు, సోంపల్లి లోకేశ్ చౌదరితో పాటు మరో 12 మందిని కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి మొల్లి పెంటిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు


తుంపాల రమేశ్

కూర్మన్నపాలెం: తెలుగు యువత గాజువాక నియోజకవర్గ ఉపాధ్యక్షునిగా నియమించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు తుంపాల రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు. తన పేరును సిఫారసు చేసిన టీడీపీ 70వ వార్డు ఇన్‌చార్జి చట్టి గోపి, అధ్యక్షుడు కేవీఎస్ శంకరరావులకు ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, తదితరులు

పెదగంట్యాడ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డు పరిధి గిరిజా కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో శనివారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబమంతంటినీ వారు ఆరోగ్యంగా ఉంచుతారన్నారు. ఆ తరువాత పీహెచ్‌సీ ఆవరణలో వైద్య శిబిరాన్ని నిర్వహించి పలువురు మహిళలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

జీఎస్టీతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఊరట

ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశంలో పేద, మధ్యతరగతి ప్రజలకు జీఎస్టీ 2.0తో ఊరట లభించిందని ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త జీఎస్టీ విధానంలో పలు మార్పులు చోటుచేసుకున్నాయని, దీనివల్ల చాలా వస్తువుల ధరలు తగ్గుముఖం పట్టాయన్నారు. రాష్ట్రంలోని ప్రజలంతా ఆనందంగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. విశాఖను విశ్వవిఖ్యాత నగరంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు తమిర శివప్రసాదరావు, మొల్లి పెంటిరాజు, ఉమామహేశ్వరరావు, డీవీ సత్యారావు, శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ మహంతి చెరువు వద్ద స్వచ్ఛ భారత్


చెరువు పరిసరాల్లోని చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చెరువులను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వాటిని సంరక్షించుకున్నప్పుడే భావితరాలకు మంచి భవిష్యత్తును అందించగలమని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. నాతయ్యపాలెం గ్రామ నాయకులతో పాటు వార్డు పారిశుధ్య సిబ్బంది, జనసేన నాయకుల ఆధ్వర్యంలో శనివారం కృష్ణ మహంతి చెరువు వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చెరువుతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో జనసేన వార్డు అధ్యక్షుడు సంగ్రాన భాస్కర్, ఎస్.సాయి ప్రమీల, పూర్ణచంద్రరావు, వంశీ, కోళ్ల అప్పలనాయుడు, సంగ్రాన సత్యారావు, తేజస్వి, తదితరులు పాల్గొన్నారు.

నందమూరినగర్‌లో అన్న సమారాధన


భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం పలుచోట్ల అన్న సమారాధనలు చేపట్టారు. ఆయా మండపాల వద్ద ప్రతిష్ఠించిన దుర్గాదేవిలకు ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఇందులో బాగంగా స్థానిక నందమూరినగర్‌లో నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమాన్ని జనసేన నేత బెహరా భాస్కరరావు ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

సరిపల్లిలో జీఎస్టీపై అవగాహన

పెందుర్తి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై శనివారం మండలంలోని సరిపల్లిలో సర్పంచ్ గొర్లె రామకృష్ణ జగన్నాథరావు ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రచారం చేపట్టారు. డీఎల్‌డీవో సి.ఉషారాణి హాజరై గ్రామంలో పర్యటించి వ్యాపార సంస్థలను సందర్శించి ప్రతి వ్యాపారి జీఎస్టీపై తప్పనసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. అంతకుముందు సరిపల్లి రామాలయం వద్ద రామకృష్ణ జగన్నాథరావు జీఎస్టీ అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు.



దివ్యాంగులకు వీల్‌చైర్లు అందజేత

పరవాడ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కోరమండల్ ఫెర్టిలైజర్స్ యాజమాన్యం సామాజిక బాధ్యతలో భాగంగా వెన్నెలపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగులకు వీల్‌చైర్లను సమకూర్చింది. వీటిని శనివారం జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెన్నెల నరసింహారావు చేతుల మీదుగా దివ్యాంగులకు అందజేశారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఆదేశాల మేరకు ముగ్గురికి వీల్‌చైర్లను అందజేసినట్టు ఆయన తెలిపారు. ఉప సర్పంచ్ వెన్నెల సన్యాసిరావు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నిబంధనలు పాటించాలి : సీఐ

లంకెలపాలెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని పరవాడ సీఐ మల్లికార్జునరావు సూచించారు. ఇక్కడి ఫ్లైఓవర్‌పై సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానాలు విధించారు. బ్రిడ్జిపై రాంగ్‌రూట్‌లో ప్రయాణాలు చేయడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ, సిబ్బంది ఉన్నారు.

దుర్గమాంబకు సారె సమర్పణ



పరవాడ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సానిక బొంకుల దిబ్బయాత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి దుర్గామాతకు సారెను సమర్పించారు. మహిళలు వివిధ రకాల పిండి వంటలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా అమ్మవారికి సమర్పించారు. ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, నాయకులు, భవానీ భక్తులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

సబ్బవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య పరిరక్షణపై మహిళలు దృష్టి సారించాలని సబ్బవరం, గుల్లేపల్లి పీహెచ్‌సీల వైద్యులు డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ దమయంతి సూచించారు. మండల కేంద్రం సబ్బవరం, బోదివలస గ్రామాల్లో శుక్రవారం స్వస్థ్ నారీ- సశక్తి పరివార్ పథకంలో భాగంగా సదస్సులో మాట్లాడారు. పదమూడేళ్లు దాటిన మహిళలకు గుండె జబ్బులు, మధుమేహం, నోటి కేన్సర్, గర్భాశయ కేన్సర్‌లకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు దెడ్డం ప్రసాదరావు, నేబర్తి శ్రీనివాసరావు, మామిడి శంకరరావు, బోకం రమణ, ఎంపీ హెచ్‌సీవో బీఎన్ నాయుడు, సూపర్‌వైజర్ కె.నారాయణరావు, స్వాతి, లోవ, ఆశ కార్యకర్తలు, సీహెచ్‌వోలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

పరవాడ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వెన్నెలపాలేనికి చెందిన ఆటో డ్రైవర్ పి.రవీంద్ర హరిప్రసాద్ ఇటీవల మృతి చెందాడు. దీంతో పరవాడ పైడిమాంబ ఆటో యూనియన్ సభ్యులు రూ.25 వేల ఆర్థికసాయం చేశారు.





కారు జోరు

... 7వ పేజీ తరువాయి

పెద్దఎత్తున బుకింగ్స్ వస్తుంటాయి. మారుతీ సుజుకీ కంపెనీ వివిధ మోడల్ కార్లు సాధారణ రోజుల్లో జిల్లాలోని అన్ని షోరూమ్‌లలో కలిపి పది నుంచి 12 వరకూ విక్రయిస్తుంటుంది. దసరాకు ముందు అయితే ఈ సంఖ్య మరో ఎనిమిది వరకూ పెరుగుతుంది. అంటే, 20 కార్లను విక్రయిస్తుంటారు. కానీ, ఈ నెల 22 నుంచి అనూహ్యంగా విక్రయాలు పెరిగినట్టు వరుణ్ మోటార్స్ ప్రతినిధులు చెబుతున్నారు. ప్రతిరోజూ కనీసం 60 నుంచి 70 వరకూ జిల్లాలో విక్రయిస్తున్నారు. ఇందులో అత్యధికం స్విఫ్ట్, డిజైర్, వేగనార్, బ్రెజా ఉన్నాయి.హ్యాండయ్ కంపెనీకి చెందిన కార్ల విక్రయాలు కూడా అలాగే ఉన్నాయి.క్రెటా కారు అత్యధికంగా సేల్ అవుతున్నట్టు ఆ సంస్థకు చెందిన ప్రతినిధులు వెల్లడించారు. సాధారణ రోజుల్లో నాలుగు షోరూమ్‌ల్లో పది కార్లను విక్రయిస్తే.. జీఎస్టీ తగ్గిన తరువాత నుంచి 25 నుంచి 30 వరకు విక్రయిస్తున్నట్టు చెబుతున్నారు. టాటా, మహీంద్ర వంటి కంపెనీలకు చెందిన కార్ల విక్రయాలు రెట్టింపు అయ్యాయంటున్నారు.

పెరిగిపోతాయన్న ప్రచారమూ..

జీఎస్టీ మార్పుతో కార్ల ధరలు ఊహించని రీతిలో తగ్గాయి. అదే సమయంలో దసరా పండగ నేపథ్యంలో కార్ల కంపెనీలు ఆఫర్లను అందిస్తున్నాయి. కారు మోడల్‌ను బట్టి లక్ష రూపాయలు నుంచి రూ.2.5 లక్షల వరకు తగ్గుతోంది. కొద్దిరోజుల తరువాత తగ్గిన జీఎస్టీ రేట్లకు అనుగుణంగా కంపెనీలు ధరలు పెంచేస్తాయన్న ప్రచారమూ డిమాండ్ పెరగడానికి కారణంగా చెబుతున్నారు.



సింహాచలం ట్రస్ట్ బోర్డుపై కసరత్తు

... 7వ పేజీ తరువాయి

ఉన్నవారు ఇతర ఏ కార్యకలాపాల్లోను కీలకంగా ఉండకూడదని నిబంధనలు చెబుతున్నాయి. దీనివల్ల ఆయన అక్కడ గవర్నర్‌గా, ఇక్కడ చైర్మన్‌గా కొనసాగడానికి సాంకేతికంగా అవకాశం లేదని అంటున్నారు. ఆయన కూడా ట్రస్ట్ బోర్డు నియామకంపై పెద్దగా ఆసక్తి చూపడం లేదని సమాచారం. గతంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు కొందరు అంతా తామై వ్యవహరించి, ఆలయ పరిపాలనా వ్యవహారాలకు అడ్డం పడిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బోర్డు అవసరం లేదని ఆయన అభిప్రాయపడుతున్నట్టు తెలిసింది. పార్టీ అధికారంలో ఉన్నందున ఇలాంటి నియామకాలు అవసరం కాబట్టి ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. 22 మందితో బోర్డును ఏర్పాటు చేయడానికి ఫైల్ సిద్ధం చేశారు.





'ది డెక్'లో మిట్టల్ ఆఫీస్?

... 7వ పేజీ తరువాయి

వాహనాల్లో వచ్చే భవనాలు ఏమీ లేవు. దాంతో బేస్‌మెంట్‌లో పార్కింగ్ కోసం కేటాయించిన మూడు అంతస్థులు సరిపోతాయని భావిస్తున్నారు. వాటిలో 300 కార్లు, మరో 200 ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసుకోవచ్చు. అంతకుమించిన డిమాండ్ ఉండదనే భావనతో పార్కింగ్ కోసం ఉద్దేశించిన రెండో అంతస్థును ఆఫీస్‌గా మార్చాలని నిర్ణయించారు.



ఆర్టీసీకి దసరా తాకిడి

... 7వ పేజీ తరువాయి

కిటకిటలాడింది. బస్సులన్నీ కిక్కిరిసిపోయాయి. ఉత్తరాంధ్ర నుంచి దూర ప్రాంతాలకు వెళ్లాలన్నా, రావాలన్నా విశాఖ ద్వారకా బస్‌స్టేషన్ ట్రాన్సిట్ పాయింట్. దాంతో కాంప్లెక్స్ ప్రయాణికులతో రద్దీగా మారింది. ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకూ ఇదే పరిస్థితి కొనసాగింది. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు అధికారులుఎప్పటికప్పుడు ప్రత్యేక సర్వీసులుఏర్పాటు చేశారు.



చిల్లర వర్తకుల నిరసన

వేపగుంట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వేపగుంట, నాయుడుతోట పరిధిలోని చిల్లర వర్తకులు శనివారం వేపగుంట కూడలిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నాకు వినతి పత్రం అందజేశారు. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

పశువులకు టీకా వేయాలి


సబ్బవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలు నిండిన ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయాలని పశు సంవర్థక శాఖ విశాఖ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్ సిబ్బందికి సూచించారు. మొగలిపురం, గోపాల్‌నగర్‌లో టీకాలు వేశారు.















ప్రకృతి ఫల సేద్యానికి మార్గదర్శి రామకృష్ణ

» ప్రకృతి ఫల రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ వెన్నెల పెంటబాబు

పెందుర్తి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి ఫల సేద్యానికి మార్గదర్శి దివంగత కందర్ప రామకృష్ణ అని సంఘ చైర్మన్ వెన్నెల పెంటబాబు అన్నారు. మండలంలోని పినగాడిలో గల ప్రకృతి ఫల రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆరో సర్వసభ్య మహాజన సమావేశం శనివారం సంస్థ కార్యాలయంలో జరిగింది. పెంటబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాగృతి సంస్థ వ్యవస్థాపక మార్గదర్శకులు, రైతు కంపెనీల ఎండీ దివంగత కందర్ప రామకృష్ణ 60వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రాంగణంలో రామకృష్ణ విగ్రహాన్ని పెంటబాబు ఆవిష్కరించి, పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతి ఫల సేద్యంతో రైతు సాధికారిత పరిజ్ఞానాన్ని విస్తృతపరిచిన మేధామి కందర్ప రామకృష్ణ అని కొనియాడారు. ప్రకృతి ఫల రైతులు సేంద్రీయ పంటలపై దృష్టిసారించి భవిష్యత్తులో చిరు ధాన్యాలు, రాగులు, సజ్జలు, కొర్రలు, అవిస పంటలు వేసి ఆరోగ్యకరమైన ఆహారాన్ని భావితరాలకు అందించాలని సభ్యులు నిర్ణయం చేశారు. అంతకుముందు సంస్థ ప్రగతి నివేదికను పెంటబాబు చదివి వినిపించారు. రైతులకు స్మార్ట్ బిజినెస్ ఈ-కార్డులను అందజేశారు. సీఈవో ప్రవీణ్, మదుపరులు, రైతులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు


దివంగత కందర్ప రామకృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం





జీఎస్టీ తగ్గింపుపై అవగాహన


కార్యక్రమంలో మాట్లాడుతున్న సర్పంచ్ గొర్లె రామకృష్ణ జగన్నాథరావు

పెందుర్తి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై శనివారం మండలంలోని సరిపల్లిలో సర్పంచ్ గొర్లె రామకృష్ణ జగన్నాథరావు ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రచారం చేపట్టారు. డీఎల్‌డీవో సి.ఉషారాణి హాజరై గ్రామంలో పర్యటించి వ్యాపార సంస్థలను సందర్శించి ప్రతి వ్యాపారి జీఎస్టీపై తప్పనసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. అంతకుముందు రామాలయం వద్ద రామకృష్ణ జగన్నాథరావు జీఎస్టీ అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈవోఆర్డీ కామేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పెందుర్తి-రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 95వ వార్డు పరిధి చీమలాపల్లి సమ సమీప ఎంఈఎస్ లేఅవుట్‌లో రూ.39.30 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం కార్పొరేటర్ ముమ్మన దేముడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో ఈ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని సదరు కాంట్రాక్టరుకు సూచించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ భద్ర, కూటమి నాయకులు అయితా ఎర్నిబాబు, సబ్బవరపు ప్రకాశ్, కేవీ సంతోశ్, పీడీ ప్రసాద్, బి.వెంకటరావు, శివ, సత్యనారాయణ, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.





రెండు లారీలు ఢీ: స్తంభించిన ట్రాఫిక్

లంకెలపాలెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : లంకెలపాలెం నుంచి ఫార్మాసిటీకి వెళ్లే మార్గంలో గల స్థానిక ఫ్లైఓవర్ డౌన్‌లో శనివారం ఉదయం రెండు లారీలు ఢీకొన్నాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. లంకెలపాలెం కూడలి నుంచి ఫార్మాసిటీకి వస్తున్న లారీ బ్రిడ్జి ఎక్కేందుకు యూ టర్న్ తీసుకుంటున్న మరో లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు దెబ్బతినగా, డ్రైవర్లు సురక్షతంగా బయట పడ్డారు. ప్రమాదానికి కారణంపై ఇరువురు డ్రైవర్లు ఘర్షణకు దిగారు. ఈ వాగ్వాదం కారణంగా బ్రిడ్జిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. కాసేపటికి సద్దుమణగడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా సాగించాయి.



బుచ్చిరాజుపాలెంలో 'స్వస్థ్ నారీ పరివార్'

ఎన్.ఎ.డి.జంక్షన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు పరిధిలోని బుచ్చిరాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ బొమ్మిడి రమణ మాట్లాడుతూ మహిళలతో పాటు చిన్నారుల ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయన్నారు. అనంతరం మహిళలు, చిన్నారులకు వైద్యులు పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ రేవతి, టీడీపీ నాయకుడు నరవ పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.



దేశపాత్రునిపాలెంలో అభివృద్ధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

పరవాడ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు దేశపాత్రునిపాలెంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు. కూటమి నాయకులు పిళ్లా శివకృష్ణ, లక్కరాజు శ్రీనివాస్, జాజుల చిన్న, అమరపిన్ని గోపి, నగిరెడ్డి వెంకట అప్పారావు, కరణం అప్పారావు, జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.







విమ్స్ వైద్యులకు శుభవార్త

» స్పెషలిస్టులకు రూ.38 వేల చొప్పున జీతం పెంపు

» ఉత్తర్వులు జారీచేసిన ఆరోగ్యశాఖ కార్యదర్శి

విశాఖపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో పనిచేస్తున్న స్పెషలిస్టు వైద్యులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఒక్కొక్కరికి రూ.38 వేలు చొప్పున జీతాలను పెంచింది. ఈ మేరకు శనివారం ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరబ్‌గౌర్ ఉత్తర్వులను జారీచేశారు. ప్రస్తుతం విమ్స్‌లో 68 మంది వైద్యులు పనిచేస్తున్నారు. వీరిలో 45 మంది స్పెషలిస్టు వైద్యులు కాగా, 23 మంది సూపర్ స్పెషలిస్ట్ వైద్యులు ఉన్నారు. సూపర్ స్పెషలిస్ట్ వైద్యుల నియామ కం సమయంలోనే రూ.1.6 లక్షల చొప్పున జీతాలను చెల్లిస్తున్నారు. స్పెషలిస్టు వైద్యులను నియమించే సమయంలో రూ.92 వేలు జీతంగా పేర్కొన్నారు. వీరంతా ఎప్పటినుంచో జీతాలు పెంచాలని కోరుతున్నారు. వీరి అభ్యర్థన మేరకు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ప్రత్యేక చొరవ తీసుకుని ఆరోగ్యశాఖ కార్యాలయానికి వెళ్లి అధి కారులకు సమస్యను విన్నవించారు. గతంలో ఆరోగ్యశాఖ కార్యదర్శి, ఆరోగ్యశాఖ మంత్రిని కలిసి అభ్యర్థించారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న ఆరోగ్యశాఖ తాజాగా ఒక్కొక్కరికి రూ.38 వేలు చొప్పున జీతాన్ని పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వీరి వేతనం రూ.1.3 లక్షలకు చేరంది. ఈ నేపథ్యంలో వైద్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ జీతాల పెంపుద్వారా ప్రభుత్వం విమ్స్‌పై బాధ్యత పెంచిందని గుర్తుచేశారు. రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలను అందిస్తామన్నారు. ప్రభుత్వానికి, ఆరోగ్యశాఖ అధికారులకు, సహకరించిన డైరెక్టర్‌కు వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సెల్‌టవర్ ఏర్పాటుపై ఫిర్యాదు

మహారాణిపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఘోషా ఆసుపత్రి జంక్షన్ కనకమహాలక్ష్మి ఆలయం సమీపంలో సెల్‌టవర్ ఏర్పాటుపై స్థానికులు ఆందోళన చెందుతున్నారని టీడీపీ 38వ వార్డు కార్పొరేటర్ గొడి విజయలక్ష్మి తెలిపారు. కనకమహాలక్ష్మి ఆలయం, ఘోషా ఆసుపత్రి సమీపంలో ఓ ఇంటిపైన సెల్ టవర్ ఏర్పాటు చేయడంపై కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ప్రాంతంలో నిత్యం జనసంచారం ఉంటుందని, ఇక్కడ టవర్ ఏర్పాటు చేస్తే ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలుగుతుందని పేర్కొన్నారు. సెల్‌టవర్ ఏర్పాటు చేయొద్దని నిర్వాహకుల వద్ద అభ్యంతరం తెలిపినా, వారంలో తొలగిస్తామని పదిరోజులైనా పట్టించుకోవడం లేదన్నారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా టవర్ తొలగింపునకు ఆదేశాలివ్వాలని కోరారు.

ఏయూలో మెడికల్ పోస్టుల ఇంటర్వ్యూలకు 34 మంది

విశాఖపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం డిస్పెన్సరీలో పనిచేసేం దుకు అవసరమైన సిబ్బందిని నియమించేందుకు శనివారం కూడా ఇంటర్వ్యూలు నిర్వహించారు. రెండో రోజు 34 మంది హాజరయ్యారు. మెడికల్ ఆఫీసర్ పోస్టుకు ఎనిమిది, ఫార్మసిస్ట్ పోస్టుకు ఆరుగురు, నర్సింగ్ పోస్టుకు 20 మంది హాజరయ్యారు. తొలిరోజు ఆయా పోస్టులకు పది మంది మాత్రమే వచ్చారు. రెండు, మూడు రోజుల్లో ఎంపికైన వారి జాబితాను విడుదల చేయనున్నారు.

నేడు ఉత్తరాంధ్ర సచివాలయ ఉద్యోగుల సమావేశం

వేపగుంట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సచివాలయ జేఏసీ పిలుపు మేరకు ఉత్తరాంధ్ర సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆదివారం సింహాచలం గోశాల సమీపంలో ఉన్న మారుతి కల్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్టు ఉద్యోగుల సంఘ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ ఉద్యోగులు సమస్యలు, ముఖ్యంగా డోర్ టూ డోర్ సర్వే, సెలవు రోజున కూడా విధులకు హాజరవ్వమనడం, సెల వులు, ప్రమోషన్లు, రావాల్సిన బకాయిలు, తదితర అంశాలపై చర్చించనున్నట్టు పేర్కొన్నారు.



హెలికాప్టర్ మ్యూజియం వద్ద పర్యాటకులు



పర్యాటకులతో కిక్కిరిసిన బీచ్ రోడ్డు



బీచ్ రోడ్డులో కురుసుర సబ్‌మెరైన్ వద్ద బారులు తీరిన పర్యాటకులు

తీరం.. జన సందోహం

విశాఖపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీచ్ రోడ్డులోని మ్యూజియాలు శనివారం సందర్శకులతో కిటకిటలాడాయి. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా వీఎంఆర్‌డీఏ అధికారులు నగరంలోని పార్కులు, బీచ్ రోడ్డులోని కురుసుర సబ్‌మెరైన్, టీయూ-142, సీ హ్యారియర్, యూహెచ్-3హెచ్ హెలికాప్టర్ మ్యూజియాల్లో ఉచిత ప్రవేశం కల్పించింది. పైగా దసరా సెలవుల సీజన్ కావడంతో పిల్లలతో కలిసి తల్లిదండ్రులు తీరానికి క్యూ కట్టారు. దీంతో అన్ని మ్యూజియం లు రద్దీగా మారాయి. బీచ్ రోడ్డు కూడా కిక్కిరిసిపోయింది. సాధారణంగా వీటిని చూడాలంటే ఒక్కొక్కరికి రూ.200 వరకు ప్రవేశ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఉచితం కావడంతో అవకాశాన్ని ఉపయోగించుకోవడానికి చాలా మంది ముందుకు వచ్చారు. దీనిపై వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్‌లు మాట్లాడుతూ, ఉచితంగా చూసినవారు పది మందికీ వాటి గురించి చెబితే.. వారు కూడా వస్తారని మన నేవీ గొప్పతనం, పనితీరు తెలుసుకుంటారని అన్నారు.

విశాఖ కేంద్రంగా పర్యాటక అభివృద్ధి

» వచ్చే రెండేళ్లలో పట్టాలెక్కనున్న వినూత్న ప్రాజెక్టులు

» పర్యాటక దినోత్సవంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

సిరిపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్రంగా పర్యాటక రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శనివారం సిరిపురం వుడా చిల్డ్రన్స్ ఎరీనాలో నిర్వహించిన వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర్జాతీయ పర్యాటకానికి చిరునామాగా విశాఖను తీర్చిదిద్దుతామన్నారు. సాగరతీరాన్ని తిలకించేందుకు డబుల్ డెక్కర్ బస్సులు అందుబాటులోకి వచ్చాయన్నారు. బీచ్ కారిడార్‌లో వినూత్న కార్యక్రమాలను చేపడుతున్నట్టు తెలిపారు. దక్షిణాంధ్ర ప్రాంతాలను కలుపుతూ టెంపుల్‌టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వచ్చే రెండేళ్లలో మరిన్ని వినూత్న ప్రాజెక్టులకు రూపకల్పన చేశామన్నారు. భీమిలి, విశాఖ ఉత్సవ్ వంటి విశేష కార్యక్రమాలను నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధమవుతోందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఇటీవల నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి కలెక్టర్ మెమెంటోలు అందజేశారు. రక్తదాతలను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి మాధవి, డీఏం జగదీశ్ వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



పర్యాటక దినోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన



సీఎం చంద్రబాబు నుంచి ఎకోఫ్రెండ్లీ అవార్డు అందుకుంటున్న సాయి ప్రియా రిసార్ట్స్ ఎండీ ప్రసాద్, విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ ప్రతినిధి బి.నరేంద్రకుమార్

నగరంలో పలు సంస్థలకు పర్యాటక అవార్డులు

» ప్రదానం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు

విశాఖపట్నం/సాగర్‌నగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్య రంగంలో సేవలందించిన వారికి విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం అవార్డులు అందజేసింది. సీఎం చంద్రబాబు నాయుడు, పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్ అవార్డులు అందజేశారు. బెస్ట్ ఎకో ఫ్రెండ్లీ హోటల్‌గా విశాఖపట్నంలోని సాయి ప్రియా బీచ్ రిసార్ట్స్ యజమాని డీఆర్‌కే ప్రసాద్ అవార్డు అందుకున్నారు. బెస్ట్ స్టాండ్ ఎలోన్ కన్వెన్షన్ సెంటర్‌గా విశ్వనాథ్ కన్వెన్షన్ ఎంపికవగా సంస్థ ప్రతినిధులు బి.ప్రమోద్‌కుమార్, బి.నరేంద్రకుమార్ అవార్డు అందుకున్నారు. బెస్ట్ యూనిక్ టూరిజం ప్రాజెక్ట్‌గా విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్‌లోని అడ్వెంచర్ థ్రిల్ సిటీ ఎంపికయింది. ఈ అవార్డును కాశీ విశ్వనాథ్ కుమారులు అందుకున్నారు. ఏపీ టూరిజంపై బెస్ట్ ఫిల్మ్‌గా 'చూశారా.. భీమిలి' ఎంపికైంది. దీనిని రేగిడి మణి భూషణ్‌కుమార్, నీరజ కలిసి తీశారు. ఫిల్మ్ షూటింగ్‌కు బెస్ట్ లొకేషన్‌గా అరకులోయలోని ఏపీఎఫ్‌డీసీ కాఫీ ఎస్టేట్ ఎంపికైంది. సంగుడి, మినుములూరు, సుంకరమెట్ట ఎస్టేట్‌లు అందులో ఉన్నాయి. బెస్ట్ థీమ్ రెస్టారెంట్‌గా సన్ రే రిసార్ట్‌లోని ఫ్లవర్ స్ట్రీట్ రెస్టారెంట్ ఎంపికైంది.

సెంట్రల్ జైలును సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ఆరిలోవ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్ర కారాగారాన్ని శనివారం ఉదయం బోర్డ్ ఆఫ్ విజటర్స్‌తో కలిసి ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి చెన్నంశెట్టి రాజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మహిళా ఖైదీలు ఉన్న స్వర్ణముఖి బ్లాక్‌ని సందర్శించారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సౌకర్యాల కల్పనపై ఆరా తీశారు. జైలులో కిచెన్ పరిశీలించారు. ప్రాణహిత ఆస్పత్రిని సందర్శించారు. తొలుత సమావేశ మందిరంలో సభ్యులు, జైలు అధికారులతో సమావేశమయ్యారు. ఖైదీలందరికీ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్, డిప్యూటీ పోలీసు కమిషనర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, జిల్లా విద్యాశాఖాధికారి, సాంఘిక సంక్షేమ అధి కారి, వ్యవసాయాదికారి, ఉపాధి కల్పనాధికారి, పారిశ్రామికాధికారి పాల్గొన్నారు.



సెంట్రల్‌జైల్‌ను పరిశీలిస్తున్న జిల్లా జడ్జి రాజు, కలెక్టర్ హరేంధిరప్రసాద్, తదితరులు

3 నుంచి పాఠశాల స్థాయి క్రీడా పోటీలు

» జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్

ఆరిలోవ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో క్రీడా పోటీలను అక్టోబరు మూడో తేదీనుంచి ప్రారంభించనున్నామని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలు అక్టోబరు 30వ తేదీవరకు కొనసాగుతాయన్నారు. సుమారు 56 క్రీడాంశాల్లో నిర్వహించే పోటీలకు ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లో చదువుతున్న వారిలో క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. అండర్-11లో పాల్గొనే విద్యార్థులు జనవరి ఒకటి 2015 లేదా ఆ తరువాత జన్మించి, మూడు నుంచి ఐదో తరగతి చదువుతున్న వారు (స్కేటింగ్‌కు మాత్రమే) అర్హులన్నారు. అండర్ 14కు 2012 జనవరి ఒకటో తేదీ లేదా ఆ తరువాత జన్మించి, ఆరు నుంచి ఇంటర్ మధ్య చదువుతున్న వారు అండర్17కు 2009 జనవరి ఒకటి లేదా ఆ తరువాత జన్మించి, ఆరు నుంచి ఇంటర్ చదువుతున్న వారు పాల్గొనవచ్చునని తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ అథ్లెటిక్స్, చెస్, యోగా, బ్యాడ్మింటన్ మండల, డివిజన్, జిల్లా స్థాయిలో, మిగిలిన క్రీడాంశాలను కేవలం జిల్లాస్థాయిలోనే పోటీలు నిర్వహిస్తామన్నారు.

సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టులపై చర్యలు

» రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి

విశాఖపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేస్తూ మహిళలను అగౌరవపరుస్తూ పోస్టులు పెడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి ఆదేశించారు. రేంజ్ పరిధిలో ఎస్పీలు, డీఎస్పీలతో శనివారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులను పరిశీలిస్తున్నామని, వాటిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఇటీవల ఇటువంటి పోస్టులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి జిల్లాలో నోడల్ అధికారిని నియమించి, అతని పర్యవేక్షణలో ప్రత్యేక బృందాల ద్వారా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నిరంతరం పరిశీలించాలన్నారు. అభ్యంతకర పోస్టులు పెట్టిన వ్యక్తులను గుర్తించి, అది ఏ కేటగిరీ కిందకు వస్తుంది, ఎలాంటి చర్యలు తీసుకున్నారనే దానిపై రోజువారీ నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. తరచూ అభ్యంతకర పోస్టులు పెట్టిన వారిని గుర్తించి, వారికి సహకరిస్తున్న వారిపై వ్యవస్థీకృత నేరం కింద కేసులు నమోదు చేయాలన్నారు. సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని, మహిళలను కించపరిచే వారి వివరాలతో జిల్లాల వారీగా డేటా బేస్ రూపొందించాలన్నారు. రేంజ్ పరిధిలో తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై ఇప్పటికే 134 కేసులు నమోదు చేశామని, 106మందిని అరెస్టుచేసి 57 కేసులకు చార్జిషీట్ దాఖలుచేస్తే 25కేసులపై విచారణ ప్రారంభమైందన్నారు. ఇటువంటి కేసులపై డివిజన్ల వారీగా డీఎస్పీలు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. కేసుల విచారణ త్వరితగతిన జరిగేలా పర్యవేక్షించాలని ఎస్పీలకు సూచించారు.



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న డీఐజీ

క్రైం... crime news

వ్యక్తిపై దాడి: ముగ్గురిపై కేసు నమోదు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన విశ్రాంతి తీసుకుంటున్న వ్యక్తిపై దాడికి పాల్పడిన వారిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ధనుంజయనాయుడు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడ గ్రామానికి చెందిన దుంపల శ్రీరాములు నగరంలో కూలి పనులు చేసుకుంటున్నాడు. రాత్రి సమయంలో ఇసుకతోట గణేష్ బార్ సమీపంలో రోడ్డు పక్కన మెట్లపై నిద్రిస్తుంటాడు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి తర్వాత సమీపంలో టిఫిన్ దుకాణం నడుపుతున్న చిన్నారావు, అతడి భార్య రాములమ్మ, వారి వద్ద పనిచేస్తున్న అప్పారావు వచ్చి, శ్రీరాములను అక్కడి నుంచి వెళ్లిపొమ్మని గదమాయించారు. తాను వెళ్లననడంతో అతడి ముఖంపై ముందు నీళ్లు, తర్వాత కళ్లల్లో కారం పొడి చల్లారు. అప్పారావు బీరు బాటిల్‌తో శ్రీరాములు తలపై మోదాడు. సమీపంలోని కొందరు వ్యక్తులు వచ్చి, అతడిని రక్షించారు. దీనిపై శ్రీరాముల ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాకపోవడంతో ఎంవీపీ పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. కేంద్రకారాగారం ఎదురుగా రామకృష్ణాపురం ప్రాంతానికి చెందిన ఎస్‌కే నూర్ మహ్మద్ (48) మద్దిలపాలెం పెద్దనుయ్యి సమీపంలో చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. బుధవారం ఉదయం ఇంటి నుంచి బయలు దేరిన మహ్మద్ మధ్యాహ్నం నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చినట్టు భార్య రమణ బీబీ ఫిర్యాదులో పేర్కొంది. మధ్యాహ్నం రెండున్నర వరకూ దుకాణంలో ఉన్నాడని, తర్వాత మద్యం సేవించడానికి తన ద్విచక్రవాహనంపై స్నేహితులతో కలసి వెళ్లినట్టు తెలిసిందని, తర్వాత ఆచూకీ తెలియలేదని పేర్కొంది. సీఐ కేఎస్ఎస్‌వీ ప్రసాద్ పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీ షీటర్‌పై పీడీ యాక్టు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులో ఉంటున్న రౌడీ షీటరు సింగపల్లి కుందన్(24) పై పీడీ యాక్టు అమలుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వ అనుమతి మేరకు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. గంజాయి రవాణాకు పాల్పడడం, ఇతర నేరాలు, శాంతికి భంగం కలిగించడం తదితర నేరాలల్లో కుందన్‌పై గాజువాక, ఏఎస్ఆర్ జిల్లాలో ఏడు క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గవర జగ్గయ్యపాలెం సమీపంలోని రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి వయసు సుమారు 50 ఏళ్లు ఉంటాయని, ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు. ఎవరికైనా మృతుడి వివరాలు తెలిస్తే గాజువాక స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

సీఐటీయూ నాయకులపై క్రిమినల్ కేసు ?

జోనల్ కార్యాలయం ముట్టడిపై అధికారుల చర్యలు

భీమునిపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : భీమిలి జోనల్ కార్యాలయాన్ని ముట్టడించిన సీఐటీయూ నాయకులపై క్రిమినల్ కేసు పెట్టడానికి జీవీఎంసీ అధికారులు రంగం సిద్ధం చేస్తు న్నారు. తగరపువలస ఈఎస్ఐ ఆస్పత్రి ప్రహరీని ఆనుకుని సర్వీసు రోడ్డు వెంబడి ఉన్న చిరు వ్యాపారుల దుకాణాలను భీమిలి జోనల్ అధికారులు ఇటీవల తొలగించిన విషయం తెలిసిందే. దుకాణాలున్న ప్రదేశం ఈఎస్ఐకి చెందినదని, దాన్ని హైవే అథారిటీకి బదలాయించారని, వారి అనుమతితోనే వ్యాపారులు దుకాణాలు నిర్వహిస్తున్నారని సీఐటీయూ నాయకులు చెబుతున్నారు. జీవీఎంసీకి ఎటువంటి సంబంధం లేకపోయినా చట్టాలను ఉల్లంఘించి బడ్డీలు తొలగించారన్నది వారి ఆరోపణ. ఈమేరకు వ్యాపారులతో కలిసి వారు శుక్రవారం జోనల్ కార్యాలయాన్ని ముట్టడించారు. దుకాణాలున్న ప్రదేశం వద్ద డ్రైనేజీ ఉందని, పారిశుధ్య సిబ్బంది కాలువల్లో పూడిక తీయడానికి ఇబ్బందిగా ఉండడంతో బడ్డీలను తొలగించామన్నది జోనల్ అధికారులు అభిప్రాయం. ఆ స్థలం కూడా జీవీఎంసీ పరిధిలోనే ఉందని, అక్కడ ప్రజలకు మౌలిక సదుపాయాలు జీవీఎంసీ కల్పిస్తుందని అధికారులు చెబుతున్నారు. చిరు వ్యాపారులను రెచ్చగొట్టి కార్యాలయం ముట్టడికి కారణమైన ఇద్దరు సీఐటీయూ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి అధికా రులు సన్నాహాలు చేస్తున్నారు. అందుకు సంబంధించిన పూర్తి ఫైల్ ప్రిపేర్ చేసి జోనల్ కమిషనరు టేబుల్‌పై సిద్ధంగా ఉంచారు. ఆయన సంతం కాగానే పోలీసులకు ఫిర్యాదు చేయనున్నారు. ఈ విషయమై జడ్సీతో ఫోన్‌లో మాట్లాడేందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

హోమ్ స్టే నిర్వాహకులతో సీఎం ముఖాముఖీ



వివరాలు తెలుసుకుంటున్న సీఎం చంద్రబాబు , ముఖాముఖీలో పాల్గొన్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్ , నిర్వాహకురాలు రేణు గుప్తా

సిరిపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పర్యాటకుల కోసం నిర్వహిస్తున్న సిరిపురంలో హోం స్టే యజమాని రేణు గుప్తాతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం వర్చువల్ విధానంలో ముచ్చటించారు. రేణు గుప్తా ఇంటి నుంచి నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పాల్గొన్నారు. హోం స్టే నిర్వహణ తీరు, వ్యాపార కార్యకలాపాలు, ఆర్థిక లబ్ధి లబ్ధి వంటి అంశాలపై సీఎం నేరుగా రేణు గుప్తాను అడిగి తెలుసుకున్నారు. పర్యాటకుల సంతృప్తి, వారి అభిప్రాయాలపై ఆరాతీశారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే హోం స్టే విధానాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. కాగా నార్త్ ఇండియా నుంచి విశాఖ వచ్చి, ఇక్కడ హోం స్టే నిర్వహిస్తున్నట్లు రేణు గుప్తా తెలిపారు. ఆదాయంతో పాటు, పర్యాటకులతో మమేకమయ్యే అవకాశం లభించడం సంతృప్తిగా ఉందన్నారు.

కనకదుర్గ అమ్మవారికి సారె సమర్పణ

» విజయవాడ తరలివెళ్లిన కనకమహాలక్ష్మి దేవస్థానం ఈవో



పట్టువస్త్రాలు, సారెతో కనకమహాలక్ష్మి ఆలయ ఈవో శోభారాణి

మహారాణిపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం విజయ వాడ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గా అమ్మ వారు లలితా త్రిపుర సుందరీ దేవీగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా విశాఖపట్నం బురుజుపేటలో కొలువై ఉన్న కనకమహాలక్ష్మి దేవస్థానం తరఫున విజయవాడ కనకదుర్గమ్మకు పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు. కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం తరఫున ఆలయ కార్యనిర్వహణ అధికారిణి కె.శోభారాణి, సిబ్బంది వెళ్లి పట్టు వస్త్రాలు అందించారు. అనంతరం ప్రత్యేక పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు.